ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
కాకినాడ
జిల్లా వార్తలు
శనివారం 8 జూన్ 2024 | 7



డెల్టా కాలువలకు 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల
సామర్లకోట భీమేశ్వరాలయంలో కొనసాగుతున్న జీర్ణోద్ధారణ పనులు



'అంతా.. ఆయనే చేశారు'



- అసెంబ్లీ ఎన్నికల ఫలితాల ఊచకోతతో జిల్లా వైసీపీ కకావికలం
- ఓడిపోయిన ఎమ్మెల్యేలంతా ఇంటినుంచి బయటకు రాలేని దుస్థితి
- పార్టీ అధ్యక్షుడు జగన్ నిర్వహించిన తాడేపల్లి సమీక్షకూ డుమ్మా
- నాలుగోసారీ వరుసగా ఓడిపోవడంతో ఎంపీ అభ్యర్థి సునీల్ వైరాగ్యం
- రాజకీయాలకు దూరంగా ఉంటే ఒత్తిడి తెచ్చి మరీ టికెట్ ఇచ్చిన జగన్
- లేదు లేదంటూనే కోట్లలో బలవతంగా ఖర్చు చేయించిన వైసీపీ
- నాలుగోసారి కూడా ఓడిపోవడంతో వైసీపీ తీరుపై గరంగరం
- పెద్దాపురంలో ఓటమితో దవులూరి రక్తకన్నీరు
- పిఠాపురంలో కడప బృందాల జోక్యం నిండా ముంచేసిందంటూ గీత గుర్రు
- పవన్‌పై ఓవరాక్షన్, డిప్యూటీ సీఎం తాలుకా ట్రోలింగ్‌తో ఇరకాటం
- ఎమ్మెల్సీ అనంతబాబును నెత్తిన రుద్దడంతో నష్టపోయానన్న భావనలో వరుపుల
- ఘోర పరాజయానికి జగన్ తీరే కారణమని ఓటమిపాలైన ఎమ్మెల్యేల లబోదిబో

(కాకినాడ, ఆంధ్రజ్యోతి)

అసెంబ్లీ ఎన్నికల్లో ఘోర పరావభంతో జిల్లాలో వైసీపీ కకావికలమైంది. ఊహించని ఊచకోతతో విలవిల్లాడుతోంది. ఒక్కటంటే ఒక్క సీటు కూడా రాకపోవడంతో తలెత్తుకోలేకపోతోంది. ఓటమిపాలైన ఎమ్మెల్యేలు ఇళ్ల నుంచి బయటకు రావడానికే సాహసించలేకపోతున్నారు. ప్రగల్భాలు పలికిన నోళ్లన్నీ మూతబడిపోయాయి. అటు పార్టీ అధ్యక్షుడు జగన్ గురువారం తాడేపల్లిలో నిర్వహించిన సమీక్షకు జిల్లానుంచి ఓటమిపాలైన ఎమ్మెల్యేలంతా డుమ్మాకొట్టారు. దారుణ పరాభవానికి జగన్ తీరే కారణమంటూ వీరంతా లోలోపల నిప్పులు కక్కుతున్నారు. నాలుగోసారీ ఎంపీ అభ్యర్థిగా ఘోరంగా ఓడిపోయిన చల మలశెట్టి సునీల్ పరిస్థితి దారుణంగా మారింది. రాజకీయాలు అచ్చిరావని దూరంగా ఉన్న తనపై ఒత్తిడి తెచ్చి పోటీ చేయించి మళ్లీ ఓడిపోయేలా చేశారని తెగ మండిపడుతున్నారు. గట్టిపోటీ ఇచ్చే అవకాశం ఉన్న తనపై ఎమ్మెల్సీ అనంతబాబును రుద్ది ఓడిపోయేలా చేశారని ప్రత్తిపాడు అభ్యర్థి వరుపుల సుబ్బారావు లబోదిబో మంటున్నారు. పెద్దాపురంలో దవులూరిది రక్తకన్నీరే. పిఠాపురంలో పవన్‌ను ఓడిస్తానని ప్రగల్భాలు పలికి చివరకు బోల్తాపడ్డ వంగా గీత తీవ్రంగా ట్రోలింగ్‌కు గురవుతున్నారు. అటు ఓడిపోయిన ఎమ్మెల్యేలు సైతం జగన్‌వల్లే తమకు అడ్రస్‌లు లేకుండా పోయాయంటూ ఓటమిపై పోస్టుమార్టం చేస్తున్నారు.

ప్చ్.. నాలుగోసారీ పాయే..

అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు నింపిన విషాదంతో జిల్లాలో వైసీపీ విలవిల్లాడుతోంది. ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని తెలుసుగానీ, ఈస్థాయిలో ఈడ్చి నేలకేసి కొట్టేంత ఆగ్రహం జనంనుంచి వ్యక్తమవడంతో అసలే మాత్రం ఊహించుకోలేకపోతోంది. జిల్లాలో కాపు, దళిత సామాజికవర్గాలతోపాటు బటన్ నొక్కుడు ప్రయోజనం పొందడంతో ఎవరూ వెంట నడవకపోయినా మహిళలు కచ్చితంగా పార్టీకే ఓటేస్తారని భావిస్తే అదేం జరగకపోవడంతో ఓడిపోయిన ఎమ్మెల్యేలు, అభ్యర్థులు జుట్టు పీక్కుంటున్నారు. కేవలం బటన్ నొక్కుడుపైనే తమ పార్టీ అధినేత జగన్ నమ్మకం పెట్టుకోవడంతో తీవ్రంగా నష్టపోయామని వాపోతున్నారు. కేవలం జగన్ తీరు వల్లే ఘోరంగా ఓడిపోయామంటూ రగిలిపోతున్నారు. ఈ నేపథ్యంలో ఫలితాలు వచ్చినప్పటినుంచి ఓటమిపాలైన ఎమ్మెల్యేలు అసలు పార్టీ క్యాడర్‌కు మొహాలే చూపించడం లేదు. జగన్ గురువారం తాడేపల్లి ప్యాలెస్‌లో నిర్వహించిన సమావేశానికి జిల్లా నుంచి అంతా డుమ్మా కొట్టేశారు. ఎవరికివారు తమకొచ్చిన అవమానకర ఫలితాలను తల్చుకుని కుమిలిపోతున్నారు. కాకినాడ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన చలమలశెట్టి సునీల్ పరిస్థితి ఘోరంగా తయారైంది. మళ్లీ నాలుగోసారి కూడా ఓటమి పాలవడం తీవ్ర అవమానంగా భావిస్తున్నారు. ఇప్పటికే మూడుసార్లు ఓడిపోవడంతో రాజకీయాలు తనకు అచ్చిరావని దూరమైపోయారు. కానీ ఎంపీ స్థానానికి పోటీ చేసే నాథుడు దొరక్క చివర్లో ఆయన్ను పిలిపించి ఒత్తిడి తెచ్చి సీటు ఇచ్చి అయిష్టంగా జగన్ బరిలోకి దింపారు. పెద్దగా డబ్బులు ఖర్చు పెట్టక్కర్లేదని ఒప్పించి ఆ తర్వాత ఎన్నికల ఖర్చు పేరుతో పార్టీ బాగా జుర్రేసింది. తీరా నాలుగోసారి కూడా ఓడిపోవడంతో ఇప్పుడు మొహం చూపించలేని పరిస్థితి తలెత్తింది. వైసీపీపై జనంలో ఉన్న తీవ్ర వ్యతిరేకత తనను ముంచేసిందని ఇప్పుడు సునీల్ నెత్తీనోరు బాదుకుంటున్నారు. పెద్దాపురంలో దవులూరి పరిస్థితి మరీ దారుణంగా మారింది. ఒక్కసారైనా గెలవాలనే ఆశతో పార్టీకి ఐదేళ్లలో కోట్లలో ఖర్చుచేశారు. తీరా దారుణంగా ఓడిపోయారు. అటు కోట్లు పోయే, సీటు గెలవకపోయే అన్నట్లు ఆయన పరిస్థితి తయారైంది. మరోపక్క ప్రత్తిపాడు సీటును జగన్ మార్చి మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావుకు ఇచ్చారు. దీంతో ఎలాగైనా టీడీపీకి గట్టిపోటీ ఇస్తానని సుబ్బారావు భావించారు. కానీ ఈలోపు ఎమ్మెల్సీ అనంతబాబును



నెత్తిన రుద్దడం తన ఓటమికి కారణంగా సుబ్బారావు భావిస్తున్నారు. తనవద్ద పనిచేసే దళిత డ్రైవర్‌ను హత్య చేసి ఇంటికి డోర్‌డెలివరీ చేసిన కేసులో అనంతబాబు జైలుకు వెళ్లి వచ్చారు. అలాంటి నేతకు నియోజకవర్గంపై పెత్తనం ఇవ్వడంతో ఆ ప్రభావం తనను నిండా ముంచేసిందని ఇప్పుడు రగిలిపోతున్నారు.

డిప్యూటీ సీఎం తాలుకా అంట..

పిఠాపురం నుంచి ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దిగిన వంగా గీత పరిస్థితి అయ్యోపాపం అన్నట్లు తయారైంది. ఇక్కడినుంచి పవన్ పోటీ చేయడంతో ఎన్నికలకు ముందే ఆమెకు ఓటమి ఖాయమైపోయింది. అయినా ఎంతోకొంత పోటీ ఇస్తాననే ధీమాతో ఉన్నారు. కానీ ఎంపీ మిథున్‌రెడ్డి, కాకినాడ సిటీ మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి కలిపి కడప బృందాలను పిఠాపురంలో దించి మొత్తం నాశనం చేసేశారంటూ ఇప్పుడామె రగిలిపోతున్నారు. వీరి రాక, డబ్బు పంచడం, మద్యం డంప్‌లు బయటపడిపోవడం వంటి చర్యలతో తీవ్రంగా నష్టం జరిగిందని తలపట్టుకుంటున్నారు. ఎన్నికల ప్రచారం చివరిరోజు జగన్ వచ్చి పిఠాపురం బహిరంగ సభలో డిప్యూటీ సీఎం ఆశచూపడంతో గీత అనుచరులు ఇంకా రెచ్చిపోయారు. ఫలితాలు రాకముందే డిప్యూటీ సీఎం తాలుకా అంటూ నానా హంగామా చేశారు. తీరా దారుణంగా ఓడిపోవడంతో సోషల్ మీడియాలో గీత విపరీతంగా ట్రోలింగ్‌కు గురవుతున్నారు. ఇవన్నీ ఒకెత్తయితే ఓటమిపాలైన మిగిలిన ఎమ్మెల్యేలంతా జగన్‌ను వేలెత్తి చూపుతున్నారు. నియంతపాలనపై జనంలో వ్యతిరేకత ఉన్నా ఆ విషయం తమకు చెప్పే అవకాశం ఇవ్వకపోవడం, ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేయడం, పన్నుల వాత, ఛార్జీల మోతతో జనం విసిగిపోయి పార్టీని నేలకేసికొట్టారని విశ్లేషిస్తూ నష్టమంతా జగన్ వల్లే జరిగిందంటూ ఒకరికొకరు ఓటమిపాలైన నేతలు ఫోన్లు చేసుకుని ఓదార్చుకుంటున్నారు. చంద్రబాబును అక్రమ కేసులో జైల్లో ఉంచడం, అనపర్తిలో అవమానించడం, చీటికిమాటికి జనసేన అధినేత పవన్‌ను ఆడిపోసుకోవడం, నలుగురు భార్యలు అంటూ విమర్శించడం జిల్లా ఓటర్లలో వైసీపీపై తీవ్ర వ్యతిరేకతకు దారితీసిందంటూ ఒకరికొకరు మాటల్లో అధినేత తీరును తీవ్రంగా తప్పుబడుతుండడం విశేషం.

భయం.. భయం



గొల్లప్రోలు పోలీస్‌స్టేషన్ సమీపంలో స్వైరవిహారం చేస్తున్న శునకాలు

- వీధుల్లో తిరగాలంటే ప్రజానీకానికి కలవరం
- శునకాల స్వైరవిహారంతో ఆందోళన
- పెరుగుతున్న కుక్కకాటు బాధితులు
- నియంత్రణకు చట్టపరంగా ఇబ్బందులు

పిఠాపురం/గొల్లప్రోలు, జూన్ 7: శునకాలు ఎక్కడయినా కనబడితే అంతా భయం.. భయం. వాటిని దాటివెళ్లేవరకు. ఏ కుక్క వచ్చి కాటువేస్తుందనే.. రాత్రివేళల్లో వాహనాలపై వెళ్లే వారి వెంబడించి మరీ కరుస్తున్నాయి. గ్రామాలు, పట్టణాలు భేదం లేదు. అన్ని చోట్ల ఇదే పరిస్థితి. కుక్కకాటుకు గురై ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య రోజురోజుకు అధికమవుతోంది.

కాకినాడ జిల్లాలో కుక్కల బెడద అధికమైంది. ప్రతిరోజూ కుక్కకాటుకు గురై ఆస్పత్రులకు వస్తున్న వారి సంఖ్య అధికంగానే ఉంటోంది. కాకినాడ జనరల్ హాస్పటల్, ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీలతోపాటు ప్రైవేటు ఆస్పత్రులను కలుపుకుంటే నిత్యం వీరి సంఖ్య 500నుంచి 700 వరకూ ఉంటోంది. ఎన్ని నియంత్రణ చర్యలు చేపట్టినా చట్టపరంగా ఉన్న ఇబ్బందులతో అధికారులు ముందడుగు వేయలేకపోతున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు పట్టణాలతోపాటు 70 గ్రామాలకు ప్రధాన కేంద్రంగా ఉన్న పిఠాపురం ప్రభుత్వాస్పత్రికి ప్రతిరోజూ సగటున 15-35మంది కుక్కకాటుకు గురై చికిత్స నిమిత్తం వస్తున్నారంటే పరిస్థితి ఎంత తీవ్రంగా ఉందో విదితమవుతోంది. పిఠాపురమే కాదు గొల్లప్రోలు, విరవ, చేబ్రోలు, మల్లాం, కొత్తపల్లి, కొమరగిరి, నాగులాపల్లి తదితర పీహెచ్‌సీలు కలుపుకుంటే ఈ సంఖ్య 100 వరకూ ఉంటుంది. కుక్కకాటుకు గురనైన వ్యక్తికి ఐదు డోసుల ఏఆర్‌వీ వ్యాక్సిన్ చేయాల్సి ఉంటుంది. ఈ వ్యాక్సిన్ ప్రైవేటు ఆస్పత్రుల్లో చేయించుకోవాలంటే రూ.2వేల వరకూ వ్యయం అవుతుంది. అన్ని ప్రభుత్వాస్పత్రులు, పీహెచ్‌సీల్లో ఏఆర్‌వీ వ్యాక్సిన్ అందుబాటులో ఉండడం కొంతవరకూ ఉపశమనం కలిగిస్తుంది. పీహెచ్‌సీల్లో ఒకటి లేదా రెండు డోసులు మాత్రమే చేసి ప్రభుత్వాస్పత్రులకు రిఫర్ చేస్తున్నారు. పీహెచ్‌సీలు, ప్రభుత్వాస్పత్రులు, అర్బన్ హెల్త్ సెంటర్లలో ఒక్క ఏఆర్‌వీ వ్యాక్సిన్ మాత్రమే ఉంటోంది. కుక్క కరిచినప్పుడు లోతుగా గాయమైతే ఏఆర్‌వీతోపాటు మరో ఇంజక్షన్ చేయాల్సి ఉంటుంది. దీని ఖరీదు ఒక్కటి రూ.7వేల నుంచి రూ.8వేల వరకూ ఉంది. ఇది జిల్లాలో కాకినాడ జీజీహెచ్‌లో మాత్రమే అందుబాటులో ఉంది. ఇక్కడ తీవ్రమైన గాయమైన వారికి మాత్రమే ఈ ఇంజక్షన్లు చేస్తున్నారు. ఈ ఇంజక్షన్ డోసులను మూడు సార్లు ఇవ్వాల్సి ఉంటుంది. అంత వ్యయం భరించడం సామాన్యులకు సాధ్యం కాదు. జిల్లా అంతటినుంచే గాక ఇతర జిల్లాలనుంచి కాకినాడ వస్తుండడంతో ఈ ఇంజక్షన్ నిల్వలు తరచూ నిండుకుంటున్నాయి. వీటిని నియోజకవర్గ కేంద్రాల్లో సీహెచ్‌సీల్లో అందుబాటులో ఉంచితే బాగుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

జంతువులపైనా దాడి

మనుషులపైనే కాదు మేకలు, కోళ్లు, గొర్రెలు, పశువులపై కుక్కలు దాడి చేస్తున్నాయి. వీటిలో తీవ్రంగా గాయపడిన జంతువులు మృత్యువాత పడుతున్నాయి. గొల్లప్రోలు మండలం తాటిపర్తి, చినజగ్గంపేట, దుర్గాడ, పిఠాపురం మండలం విరవ, విరవాడ, కోలంక తదితర ప్రాంతాల్లో కొంతకాలంగా జరిగిన కుక్కల దాడిలో పలు గొర్రెలు, మేకలు, దూడలు మృత్యువాతపడ్డాయి.

నియంత్రణకు చట్టపరమైన ఇబ్బందులు

కుక్కలను గతంలో గ్రామ పంచాయతీలు, పురపాలక సంఘాల ఆధ్వర్యంలో పట్టుకుని సంహరించేవారు. పరిస్థితులకు అనుగుణంగా ఆయా స్థానిక సంస్థలు చర్యలు చేపట్టడంతో ఇబ్బందులు ఉండేది కాదు. తొమ్మిదేళ్ల క్రితం జరిగిన ఒక వ్యవహారం పరిస్థితిని మార్చేసింది. జిల్లా కేంద్రానికి చేర్చి ఉన్న మండలంలో శునకాలను ఈ విధంగా సంహరించిన సంఘటనపై జంతుప్రేమికులు కోర్టును ఆశ్రయించడంతో అధికారులకు ఇబ్బందులు ఎదురయ్యాయి. జిల్లా కలెక్టర్ సహా అధికారులందరినీ బాధ్యులు చేశారు. దీంతో అధికారులు ముందుకు వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. రోజురోజుకు కుక్కకాట్లకు గురవుతున్న వారి సంఖ్య పెరుగుతున్నా వాటిని నియంత్రించేందుకు చర్యలు చేపట్టలేకపోతున్నారు. ప్రత్యామ్నాయంగా కుక్కలను పట్టుకుని వాటికి సంతానోత్పత్తి నిరోధక వేక్సిన్లు చేయించాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆచరణలో ఇది అంతంతమాత్రమే. కొన్నిప్రాంతాల్లో శునకాలను పట్టుకుని సుదూర ప్రాంతాల్లో వదిలిపెడుతున్నారు. దీంతో ఒకచోట సమస్య తగ్గినా మరో చోట అధికమయ్యే పరిసితి ఏర్పడింది.

వెంటబడి తరుముతూ...

చీకటి వేళ రోడ్లపై సంచరించేందుకు ప్రజలు ఆందోళన చెందుతున్నారు. గ్రామాలు, పట్టణాల్లో వీధుల్లో రాత్రి సమయాల్లో వాహనాలు, సైకిళ్లపై వెళ్లేవారు, పాదచారులు వెంటబండి కుక్కలు తరుముతున్నాయి. వీటిని తప్పించుకునే క్రమంలో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. పిఠాపురం, గొల్లప్రోలు వంటి పట్టణాల్లో రహదారులపై కుక్కలు గుంపులుగుంపులుగా సంచరిస్తున్నాయి. ఇవి తమ వెంట పడతాయోమనని ప్రజలు ఆందోళన చెందుతున్నారు. ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా కుక్కకాటుకు గురికాక తప్పడం లేదు. పిఠాపురం మునిసిపల్ కార్యాలయం చెంతన ఇదే పరిస్థితి. ఇక వీధుల్లోనూ అదే స్థితి.

ఎండతీవ్రత, ఉక్కపోతతో..

సాధారణ సమయాల్లో కంటే వేసవిలోను, ఉక్కపోత వాతావరణంలో కుక్కకాటుకు గురయ్యే వారి సంఖ్య అధికంగా ఉంటుంది. వేడి వాతావరణంతో వాటికి చెమట పట్టక ఎండ తీవ్రత తట్టుకోలేక కుక్కలు విచక్షణారహితంగా మీద పడి కరుస్తున్నాయని పశువైద్యులు చెబుతున్నారు. ఇప్పటికే పిఠాపురం, గొల్లప్రోలు, కొత్తపల్లి మండలాల్లో పలుచోట్ల ఇటువంటి సంఘటనలు చోటు చేసుకుంటున్నాయి. వ్యాక్సినేషన్‌తోపాటు గ్రామాలు, పట్టణాల్లో కుక్కల నియంత్రణపై జిల్లా అధికార యంత్రాంగంతో పాటు స్థానిక సంస్థల అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

జీజీహెచ్‌లో రోగులకు పరిపూర్ణమైన వైద్యసేవలు: కలెక్టర్ నివాస్



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ నివాస్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 7: కాకినాడ జీజీహెచ్‌లో ఉన్న మౌలిక వనరులను సమర్థంగా వినియోగించుకుంటూ రోగులకు పరిపూర్ణమైన ఆరోగ్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ అధికారులను ఆదేశించారు. కాకినాడ జీజీహెచ్‌లో నిత్యం జరుగుతున్న కార్యకలాపాలు, వైద్యం కోసం వస్తున్న ప్రజలకు వివిధ విభాగాల వారీగా అందిస్తున్న వైద్యసేవలు తదితర అంశాలపై జిల్లా కలెక్టరేట్‌లో జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ లావణ్యకుమారి, వివిధ విభాగాల అధికారులతో శుక్రవారం కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉభయగోదావరి జిల్లాల నుంచి అత్యధిక ప్రజలు నిత్యం జీజీహెచ్ ద్వారా ఆరోగ్య సేవలు అందిస్తున్నామన్నారు వైద్య అధికారులు అందుబాటులో ఉన్న మౌలిక వనరులపై ప్రత్యేక దృషి పెట్టి ఉత్తమమైన ఆరోగ్య సేవలు అందించాలన్నారు. జీజీహెచ్‌లో రేడియేషన్, ఎక్స్‌రే, సరికల్, గైనకాలజీ, పీడియాట్రిక్, ఆర్థోపెడిక్, న్యూరోసర్జరీ, జనరల్ మెడిసన్, ఆప్తమాలజీ, ఈఎన్టీ వంటి విభాగాల వారీగా చేస్తున్న శస్త్రచికిత్సలు అందుబాటులో ఉన్న పడకల సంఖ్య, డ్యూటీ డాక్టర్స్, పారామెడికల్ సిబ్బంది, డ్రగ్స్ ఇండెంట్, రోగులకు భోజనం, మందులు పంపిణీ, పారిశుధ్యం, ఆరోగ్యశ్రీ కేసులు, మహాప్రస్థానం వాహనాలు తదితర అంశాలపై ఆరాతీసారు. ఈకార్యక్రమంలో డీసీహెచ్ఎస్ స్వప్న, రేడియేషన్, సర్జికల్, ఎక్స్‌రే, జనరల్, యురాలజీ తదితర విభాగాల వైద్యులు పాల్గొన్నారు.

బిల్లులు రెండురోజుల్లో సమర్పించాలి: కలెక్టర్

కలెక్టరేట్(కాకినాడ), జూన్ 7: సార్వత్రిక ఎన్నికలు 2024లో భాగంగా పోలింగ్, కౌంటింగ్‌కు సంబంధించి వివిధ పనులు చేసిన కాంట్రాక్టర్లు, వివిధ సంస్థలు సమర్పించాల్సిన సంబంధింత బిల్లులను కాకినాడ కలెక్టర్ కార్యాలయంలో ఎలక్షన్ సెక్షన్‌లో రెండు రోజుల్లోగా సమర్పించాలని జిల్లా కలెక్టర్ జె.నివాస్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి వివిధ పనులు చేసిన వారు బారికేడ్‌లు, ఏసీలు, టీవీలు, టెంట్లు, ఫ్యాన్లు, కూలర్లు, కంప్యూటర్లు, ప్రింటర్లు, మెస్ తదితర పనులు చేసిన కాంట్రాక్టర్లు, సంస్థల బిల్లులను రెండు రోజుల్లో ఎలక్షన్ సెక్షన్‌లో అందజేయాలన్నారు.

భూసార పరీక్షలకు రంగం సిద్ధం



భూసార పరీక్షలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

- ఒక్కో ఆర్బీకే పరిధిలో 40 నమూనాల సేకరణ
- 2019-2020లో చివరిసారి మట్టి నమూనాలు
- వైసీపీ హయాంలో మట్టి పరీక్షలకు మంగళం
- కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో అధికారుల్లో కదలిక
- ఆర్‌కేవీవై ద్వారా పరీక్షలు
- ఆనందం వ్యక్తం చేస్తున్నరైతులు

పెద్దాపురం, జూన్ 7: వ్యవసాయ రంగంలో ఆశించిన మంచి ఫలితాలు కావాలన్నా, అధిక దిగుబడులు సాధించాలన్నా భూసార పరీక్షలే కీలకం. భూమి సారవంతంగా ఉంటేనే పంటలు బాగా పండుతాయి. ఈ మేరకు ఏటా సక్రమంగా మట్టి పరీక్షలు నిర్వహించి పోషకాల శాతంపై రైతులకు పూర్తిస్థాయి అవగాహన కల్పిస్తే మెరుగైన ఫలసాయం సాధించే అవకాశం ఉంటుంది. 2019-20లో ఒకసారి మట్టి నమూనా పరీక్షలు జరిగాయి. వైసీపీ ప్రభుత్వం వచ్చాకా ఈప్రక్రియ ఆగిపోయింది. గతేడాది ఏప్రిల్లో మళ్లీ ప్రారం భించాలని ఉన్నతాధికారులు ఆదేశించారు. దీంతో తూతూమంత్రంగా చేపట్టారు. తాజాగా కూటమి రాష్ట్రంలో అధికారంలోకి రావడంతో వ్యవసాయశాఖ అధికారుల్లో కదలిక వచ్చింది. ఇందుకు అనుగుణంగా మండలాలు, జిల్లాలవారీగా లక్ష్యాలను నిర్దేశిస్తూ ఆదేశాలు జారీ అయ్యాయి. కాకినాడ జిల్లాలో 10వేల మట్టి నమూనా పరీక్షలు నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. ఒక్కో ఆర్బీకే పరిధిలో 40 నమూనాలను సేకరించనున్నారు.

ఇంతవరకూ ఇబ్బందులు..

వైసీపీ హయాంలో ఈ పరీక్షలు లేకపోవడంతో రైతులు తమ పొలాల్లో ఎంత శాతం ఎరువులు వినియోగించాలో తెలియని పరిస్థితి నెలకొంది. దీంతో వారు అవసరానికి మించి వినియోగిస్తున్నారు. ఈ క్రమంలో భూమి సహజత్వాన్ని కోల్పోతోంది. ఏటా వినియోగం పెంచుకోవాల్సి వస్తోంది. దీనివల్ల భూసారం తగ్గుతోంది. కొంతకాలంగా పలు గ్రామాల్లో సంబంధిత మార్పులు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ఏ పంటకైనా 18 రకాల పోషకాలు అవసరం. వాటిలో ఏదిలేకపోయినా దిగుబడులు తగ్గే అవకాశంఉంది. గతప్రభుత్వ హయాంలో ప్రతి నియోజకవర్గంలో ఒక అగ్రి ల్యాబ్ ఏర్పాటైంది. విత్తనాలు, ఎరువులు, వినియోగానికి ముందు పరీక్షలు నిర్వహించడానికి వీలుగా వీటిని నిర్మిస్తున్నట్లు వైసీపీ ప్రకటించింది. ఇందులో భాగంగానే మట్టి నమూనా పరీక్షలు చేస్తామని వెల్లడించారు. భవనాలు నిర్మించి ప్రారంభించినా ఇప్పటివరకూ సేవలు లేవు. కొన్నింట్లో పరికరాలు, రసా యనాల సరఫరా ప్రక్రియ ఆగిపోయింది.

ఆర్‌కేవీవై ద్వారా పరీక్షలు: దైవకుమార్, ఏడీఏ, పెద్దాపురం

రాష్ట్రీయ కృషి వికాస్ యోజన(ఆర్‌కేవీవై) కింద 2024-25 సంవత్సరంలో లక్ష్యాలను నిర్దేశించారు. 70శాతం నమూనాలను ఖరీఫ్ సీజన్‌కు ముందే తీసి పరీక్షలు చేయించాలని ఆదేశాలు అందాయి. త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటాం.

సూక్ష్మపోషకాలు రాయితీపై..

టీడీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి సర్వే నెంబరులోనూ భూసార పరీక్షలు చేసే రైతులకు కార్డులు అందించేవారు. జింకు, జిప్సం, తదితరాలను రాయితీ పై పంపిణీ చేసేవారు. వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని అందించలేదు. బయట మార్కెట్లో పూర్తి ధరకు కొనుగోలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. సరైన అవగాహన లేని అన్నదాతలు ఎక్కువగా మందుల వాడడంతో ఖర్చులు పెరిగిపోయాయి. ఇలాంటి పరిస్థితుల్లో మట్టి పరీక్షల ద్వారా మాత్రమే నేలలో ఆమ్ల, క్షార లవణాలస్థాయి, భాస్వరం, పొటాషి యం, ఎంతమేర ఉన్నాయో సులువుగా తెలుసుకో వచ్చు. దీనికి అనుగుణంగా ఎరువులు మితంగా వాడేందుకు అవకాశం ఏర్పడి పెట్టుబడి తగ్గి అధిక దిగుబడులు సాధించే వీలుం టుంది.

వర్మ కారుపై రాళ్ల దాడి.. అద్దాలు ధ్వంసం

- మెయిన్‌లో

- టీడీపీ నుంచి జనసేనలో చేరిన వారి పనేనన్న వర్మ
- వీరంతా ఎంపీ గ్రూప్ అని ఆరోపణ
- నన్ను చంపడానికి కుట్ర పన్నారు.. మాజీ ఎమ్మెల్యే వర్మ
- గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో ఘటన







గొల్లప్రోలు మండలం వన్నెపూడిలో రాళ్లు, ఇటుక దాడిలో ధ్వంసమైన వర్మ కారు అద్దాలు
ఇన్‌సెట్‌లో వర్మ
పోలీస్‌స్టేషన్ వద్ద ధర్నా చేస్తున్న టీడీపీ నేతలు



ప్రకృతి సోయగం..

డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా అమలాపురంలోని చంద్రబాబు ఆరోగ్య ఉద్యానవనంలో శుక్రవారం సాయం సంధ్యవేళ కనిపించిన దృశ్యమిది. సందర్శకులను ఎంతగానో ఆకట్టుకుంది.

- అమలాపురం టౌన్

శస్త్ర చికిత్సా విధానంలో ఫ్యూజ్ కీలకం

జీఎస్ఎల్‌లో ఘనంగా ప్రారంభమైన వర్క్‌షాపు

రాజానగరం, జూన్ 7: శస్త్ర చికిత్సా విధానంలో ఫండమెంట్ యూజ్ ఆఫ్ సర్జికల్ ఎనర్జీ (ఫ్యూజ్)ఎంతో కీలకమని ప్రఖ్యాత అమెరికా వైద్య నిపుణుడు డాక్టర్ జైసా ఓలాస్కీ అన్నారు. రాజా నగరం సమీపంలోని జీఎస్ఎల్ మెడికల్ కళాశాల, అమెరికా గాస్ట్రో ఇంటెస్టినల్, ఎండోస్కోపిక్ సర్జన్ల సొసైటీ(ఎస్ఏజీఈఎస్) సంయుక్తంగా జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో రెండురోజుల పాటు నిర్వహించనున్న ఫ్యూజ్ వర్క్‌షాప్ శుక్రవారం ఘనంగా ప్రారంభ మైంది. దీనికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన డాక్టర్ జైసా ఓలాస్కీ మాట్లాడుతూ శస్త్రచికిత్సా పరికరాలను సమర్థవంతంగా ఉపయో గించడంలో సాధన అవసరమన్నారు. రోగులకు నిర్వహించే శస్త్ర చికిత్సల్లో ఫ్యూజ్ విధానం వినియోగాన్ని వివరించారు. మరో ముఖ్యఅతిథి న్యూయార్క్‌కు చెందిన డాక్టర్ జాకబ్స్ స్కూల్ ఆఫ్ మెడిసిన్, ప్రొఫెసర్ ఫ్యూజ్ కోర్సు స్థాపకుడు డాక్టర్ స్టీవెన్ షైట్జ్‌బర్గ్ మాట్లాడుతూ ఫ్యూజ్ కోర్సును వినియోగించుకుని రోగుల భద్రత, శస్త్రచికిత్స పనితనం మెరుగుపర్చుకోవాలన్నారు. ఈ వర్క్‌షాప్ ద్వారా నైపుణ్యాలను, జ్ఞానాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. నూతన కోర్సు మూలాలు, ప్రయోజనాలను వివ రించారు. మరోఅతిథి సట్టర్ ఈస్ట్ బే మెడికల్ గ్రూప్, సాన్ ఫ్రా న్సిస్కో జనరల్ సర్జన్ డాక్టర్ పాస్కల్ ఫుచ్‌షుబెర్, యూనివర్శిటీ ఆఫ్ కొలరెడో హాస్పిటల్, డెన్వర్‌లో అసిస్టెంట్ ప్రొఫెసర్ ఆఫ్ సర్జరీ వైద్యులు ఎడ్వర్డ్ జోన్స్, స్టోనీ బ్రూక్ యూనివర్శిటీ హాస్పి టల్ (న్యూయార్క్) జనరల్ సర్జన్ డాక్టర్ కింగా పవర్స్ తదితర సీనియర్ సర్జన్లు ఫ్యూజ్ కోర్సు ప్రాముఖ్యతను వివరించారు. జీఎస్ఎల్ మెడికల్ కళాశాలలో కల్పించిన ఆధునిక సిమ్యులేటర్ పరికరాలు వైద్య విద్యార్థులకు ఎంతగానో దోహపడతాయన్నారు. దీనిపై జీఎస్ఎల్ వైద్య విద్యాసంస్థల ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కరరావు తమ సంస్థలో నిర్వహించే వివిధ శస్త్ర చికిత్సా పరిక రాలు, శస్త్ర చికిత్సా ఫలితాలను మెరుగుపర్చడంలో కీలకపాత్ర పోషిస్తున్నాయని వివరించారు. రెండు రోజులపాటు జరగనున్న ఫ్యూజ్ వర్క్‌షాప్‌ను ముఖ్యఅతిథి డాక్టర్ జైసా ఓలాస్కీ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అనంతరం అతిథులను జీఎస్ఎల్ యాజమాన్యం ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేసింది.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ముఖ్యఅతిథులు

దాస సాహిత్య ప్రాజెక్టు ద్వారా

8,600 భక్తి మండలి గ్రూపులు

● టీటీడీ సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు



ఆలమూరు, జూన్ 7: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి భక్తిదాసుడైన పురందరదాసు కీర్తనలను ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి దాస సాహిత్య ప్రాజెక్టు విశేష కృషిచేస్తోందని, ఇందులో భాగంగా 8,600 మహిళ భక్తిమండలి గ్రూపులు ఏర్పాటు చేశామని దాస సాహిత్య ప్రాజెక్టు అధికారి ఆనందతీర్థాచార్యులు తెలిపారు. ఇందులో 4,500 గ్రూపులు యాక్టివ్‌గా పని చేస్తున్నాయన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమజిల్లా ఆలమూరు మండలం గుమ్మిలేరు విచ్చేసిన ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. దక్షిణ భారతదేశంలో దాస సాహిత్యం ప్రాచుర్యం పొందిందన్నారు. పురందరదాసు 4.75 లక్షల సంకీర్తనలు రచించారని, వాటిని ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 46ఏళ్ల క్రితం టీటీడీ దాస సాహిత్య ప్రాజెక్టు ఏర్పాటు చేసిందన్నారు. పురందరదాసు కీర్తనల సారాంశాన్ని వివరించి మండలి గ్రూపులకు నేర్పిస్తామని వివరించారు. కోలాటం ద్వారా కూడా సంకీర్తనలు ఆలపించే విధంగా నేర్పిస్తున్నట్టు చెప్పారు. గుమ్మిలేరులో ఈనెల 6, 7 తేదీల్లో శిక్షణ ఇచ్చామన్నారు. దాస సాహిత్య ప్రాజెక్టుకు తిరుమల తిరుపతి దేవస్థానం ద్వారా ఈ ఏడాది రూ.2.30 కోట్లు బడ్జెట్ కేటాయించారని పీవో ఆనందతీర్థాచార్యులు తెలిపారు. ప్రాజెక్టుకు మరింత ప్రాచుర్యం కల్పించేందుకు బడ్జెట్ పెంచితే దక్షిణ భారతదేశంలో ప్రచారం చేయడానికి వీలుకలుగుతుందన్నారు. గ్రూపులకు పలు ఆధ్యాత్మిక క్షేత్రాల్లో వర్క్‌షాపులు నిర్వహిస్తున్నట్టు వివరించారు. విలేకరుల సమావేశంలో దాస సాహిత్య ప్రాచుర్యకర్త పి.ముకుందేశ్వరస్వామి పాల్గొన్నారు.

సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి

రూ.లక్ష విరాళం



పీఆర్వో కృష్ణారావుకు విరాళం అందజేస్తున్న దాత

అన్నవరం, జూన్ 7: అన్నవరం దేవస్థానంలో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న సత్యదేవా నిత్యాన్నదాన పథకానికి శుక్రవారం కాతేరుకు చెందిన జి.వెంకట సత్యనారాయణ రూ.1,00,001లు విరాళంగా సమర్పించారు. ఈ మొత్తాన్ని దాత పీఆర్వో కృష్ణారావుకు అందజేయగా దాతను ఆయన అభినందించి వారికి స్వామివారి ప్రసాదం, ప్రత్యేక దర్శనం కల్పించారు.

ఘనం చండీహోమం

రత్నగిరి క్షేత్రరక్షకి వనదుర్గ ఆలయంలో శుక్రవారం చండీహోమం ఘనంగా జరిగింది. ఉదయం 9గంటలకు పండితులు గణపతిపూజ, పుణ్యాహవచనం అనంతరం అమ్మవారికి చండీ,సప్తసతి పారాయణలు, మూలమంత్ర జపములు పఠించారు. 11 గంటలకు పవిత్ర హోమగుండంలో సుగంధ ద్రవ్యాలను అర్పించి పూర్ణాహుతి గావించారు. చతుర్వేద పండితుల వేదాశీర్వచనాలు అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

నిత్యాన్నదానానికి రూ.1,00,116 విరాళం



దాతలకు స్వామివారి చిత్రపటం అందిస్తున్న ఆలయ సిబ్బంది

మామిడికుదురు, జూన్ 7: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మామిడికుదురు మండలం అప్పనపల్లి బాలబాలాజీ దేవస్థానంలో నిత్యాన్నదాన పథకానికి తూర్పుగోదావరి జిల్లా రాజమహేంద్రవరానికి చెందిన నేదునూరి శేషగిరి-బేబీఅన్నపూర్ణ దంపతులు శుక్రవారం రూ.1,00,116 విరాళం అందించారు. తమ పెళ్లిరోజైన డిసెంబరు 9న ప్రతి సంవత్సరం అన్నదానం జరిపించాలని కోరారు. దాత దంపతులకు ఆలయ సిబ్బంది స్వామివారి చిత్రపటంతో పాటు ప్రసాదాలు అందించి అభినందించారు.

డెల్టా కాలువలకు

6 వేల క్యూసెక్కుల నీరు విడుదల

ధవళేశ్వరం, జూన్7: కాటన్ బ్యారేజ్ నుంచి మూడు డెల్టా కాలువలకు శుక్రవారం 6వేల క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. తూర్పుడెల్టా ప్రధాన పంట కాలువకు 1000 క్యూసెక్కులు, మధ్యడెల్టా ప్రధాన పంట కాలువకు 1000 క్యూసెక్కులు, పశ్చిమ డెల్టా ప్రధాన పంట కాలువకు 4000 క్యూసెక్కులు చొప్పున సాగునీరు విడుదల అవుతుంది. ధవళేశ్వరం వద్ద గోదావరి నీటిమట్టం 10.65 అడుగులుగా నమోదుకాగా 3141 క్యూసెక్కుల మిగులు జలాలు బ్యారేజ్ నుంచి దిగువకు ప్రవహిస్తున్నాయి.

ఆంధ్రజ్యోతి క్లాసిఫైడ్స్

CHANGE OF NAME

★ I, Prasanna Tulasimani Nadapana W/o. Anil Kumar Valavala,H.No.1-111, Tekisettipalem, Main Centre, Sakhinetipalli Mandal, Antarvedipalem, Dr.B.R. Ambedkar Konaseema, A.P., I have changed my name from Prasanna Tulasimani Valavala (Old Name) to Prasanna Tulasimani Nadapana (New Name). Hence after all my documents and correspondence will be continue with my new name Prasanna Tulasimani Nadapana.

AJH-0258

4 Lines CLASSIFIED Rs.230/- Only

వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించిన జేడీ విజయ

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 7: కాకినాడ జీజీహెచ్ ప్రాంగణంలో మహిళా, శిశు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుపుతున్న సఖి వన్‌స్టాప్ సెంటర్‌ను రాష్ట్ర మహిళా స్కీమ్స్ జాయింట్ డైరెక్టర్ (జేడీ) కె.విజయ శుక్రవారం సందర్శించి అక్కడ రికార్డులను పరిశీలించి బాధితుల వివరాలను తెలుసుకుని వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. రాష్ట్రంలోని మహిళలకు సంబంధించిన అన్ని ఇన్‌స్టిట్యూషన్స్ పని తీరును పరిశీలిన నిమిత్తం ఆమె శుక్రవారం జీజీహెచ్‌లోని వన్‌స్టాప్ సెంటర్‌ను సందర్శించారు. ఇక్కడ పనిచేస్తున్న సిబ్బంది పనిలో నిబద్ధత కలిగి బాధితులకు అండగా ఉంటూ వారికి శారీరకంగా, మానసికంగా ఏర్పడిన బాధకు శాంత్వన చేకూర్చి వైద్య చికిత్స విషయంలో వ్యక్తిగత శ్రద్ధ తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.ప్రవీణ, వన్‌స్టాప్ సెంటర్ అడ్మినిస్ట్రేటర్ ఆర్.శైలజ పాల్గొన్నారు.

పంపా రిజర్వాయర్ గేట్ల పనితీరుపై ఆందోళన

● పరిశీలించిన ఇరిగేషన్ ఇంజనీరింగ్ అధికారులు

అన్నవరం, జూన్ 7: మెట్టప్రాంత రైతుల వరప్రధాయిని అయిన పంపా రిజర్వాయిర్ గేట్ల పనితీరుపై ఆందోళన వ్యక్తం అవుతుంది. గత ప్రభుత్వ హయాంలో మరమ్మతులకు నిధులు విడుదల చేయకపోవడంతో తాత్కాలిక పనులు చేపట్టి గట్టెక్కించారు. వర్షాకాలం ప్రారంభం కానుండడంతో గేట్ల పరిస్థితిపై శుక్రవారం ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ సతీష్‌కుమార్, సూపరింటెండెంట్ ఇంజనీర్ శ్రీనివాసరావు, ఈఈ శేషగిరి తదితరులు పరిశీలించారు. ప్రధానంగా నాల్గవ నంబరు వరదగేటు గతంలో ఇబ్బంది పెట్టడంతో గేట్ల ఆపరేటింగ్ చేయించి పరిశీలించారు. ప్రస్తుతం రిజర్వాయర్‌లో నీరు లేకపోవడంతో సులువుగా పైకి కిందకు దిగినా రిజర్వాయర్ నిండితే గేట్లు పైకి లెగడం, కిందకు దిగడం వంటి పరిస్థితులు ఉత్పన్నమవుతాయని సిబ్బంది సూచించారు. రెండ్రోజుల్లో మరోసారి పరిశీలించి అత్యవసరంగా ఉన్న పనులకు నిధులు మంజూరు చేయించి అనంతరం శాశ్వత పనులు చేపడతామని ఈఎన్‌సీ సతీష్‌కుమార్ తెలిపారు. ఇటీవల మరమ్మతులు చేపట్టిన పంటకాలువ గేట్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఇరిగేషన్ అధికారిణి శ్రీదేవి, తదితరులు పాల్గొన్నారు.



పంపా గేట్లను పరిశీలిస్తున్న ఇరిగేషన్ చీఫ్ ఇంజనీర్ తదితరులు

కొనసాగుతున్న

జీర్ణోద్ధారణ పనులు

ఈనెల 17 వరకూ స్వామి దర్శనాలు నిలుపుదల



సామర్లకోట కుమార రామ భీమేశ్వరుడు

సామర్లకోట, జూన్ 7: పంచారామ పుణ్యక్షేత్రమైన కాకినాడ జిల్లా సామర్లకోట కుమారరామ భీమేశ్వరాల యంలో శివలింగానికి జరుగుతున్న జీర్ణోద్ధారణ పనులు ఇంకా నిర్వహించాల్సి ఉన్నందున శివలింగ దర్శనాలు ఈనెల 16వరకూ నిర్వహించనున్నట్లు ఆలయ కార్య నిర్వహణాధికారి బళ్ల నీలకంఠం తెలిపారు. శివలింగ జీర్ణోద్ధారణ పనులు భారతీయ పురావస్తుశాఖ ఆధ్వర్యంలో గతనెల 28 నుంచీ నిర్వహిస్తున్న విషయం విధితమే. ముందుగా ప్రకటించిన మేరకు ఈనెల 8 వరకూ శివలింగ దర్శనా లు నిలిపివేసిన విసయం విధితమే. నిర్దేశించిన మేరకు పనులు పూర్తికానందున 16వరకూ నిర్వహించనున్నందున సంప్రోక్షణ చర్య లు పూర్తిచేసి ఈనెల 17న సోమవారం ఏకాదశి నుంచి గర్భాలయం పునఃర్దర్శనం భక్తులకు ఏర్పాటుచేస్తామని ఈవో తెలిపారు. భక్తులు గమనించి దేవదాయ, భారతీయ పురావస్తుశాఖల అధికారులు చేస్తున్న పనులకు సహకరించాలని ఈవో నీలకంఠం తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ పండితులు సోమేశ్వరశర్మ, చెరుకూరి రాంబా బు, వెంకన్న, అంజిబాబు, శ్రీనివాసరావు, వినయ్ పాల్గొన్నారు.

విజిలెన్స్ అధికారుల దాడులు

● రూ. 5 లక్షల విలువ గల 3,500 కిలోల బియ్యం, వాహనం పట్టివేత

సామర్లకోట, జూన్ 7: కాకినాడ జిల్లా సామర్లకోట మండలం ఉండూరు- వీకె.రాయపురం రోడ్డులో ఏపీ 39 యూసీ 2589 అనే మినీ వ్యాన్ వాహనంలో 3,500 కిలోల పరిమాణంలో 70 మూటలుగా కట్టి అక్రమంగా తరలిస్తుండగా విజిలెన్స్ అధికారులు శుక్రవారం అకస్మిక దాడులు నిర్వహించి సీజ్ చేశారు. రేషన్ దుకాణాల ద్వారా ప్రజలకు పంపిణీ చేసే రేషన్ బియ్యంగా వీటిని నిర్ధారించి అక్రమ తరలింపునకు పాల్పడిన పిఠాపురం మండలం బి.ప్రత్తిపాడుకు చెందిన బొజ్జా మణికంఠపై 6ఏ చట్టం కింద, క్రిమినల్ కేసులు నమోదు చేయగా అక్రమ తరలింపు వ్యవహారంలో అనుమానితులుగా ఉన్న వారిపైనా కేసులు నమోదు చేశామని విజిలెన్స్ అధికారులు చెప్పారు. అక్రమంగా తరలిస్తున్న బియ్యాన్ని సామర్లకోట ఎంఎస్వోకు అప్పగించి వాహనాన్ని సామర్లకోట పోలీసులకు అప్పగించామని విజిలెన్స్ అధికారులు తెలిపారు. ఈ దాడులలో విజిలెన్స్ అధికారులు జగన్నాధరెడ్డి, నవీన్‌కుమార్, జీవానందం, వీరబాబు, సీఎస్‌డీటి కీర్తితో బాటూ రెవెన్యూ, సివిల్ సప్లయ్ అధికారులు, వీఆర్వోలు పాల్గొన్నారు.



అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం వాహనాన్ని పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

విద్యుదాఘాతంతో ఐదు గేదెలు మృతి

● రూ.5 లక్షల వరకు ఆస్తినష్టం

ఎటపాక, జూన్ 7: వ్యవసాయ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద ఏర్పాటుచేసిన ఎర్త్ పైపువైరు తగిలి ఐదు గేదెలు మృతి చెందిన సంఘటన శుక్రవారం పురు షోత్తపట్నం పంచాయతీలోని కొల్లుగూడెం గ్రామంలో చోటుచేసుకుంది. కొల్లుగూడెం గ్రామంలోని గార్లపాటి శాంతారావు, గార్లపాటి రామారావు, గార్లపాటి శ్రీపతి రైతులకు చెందిన నాలుగు గేదెలు, ఒక దూడ మేతకోసం గ్రామశివారులోని వ్యవసాయ ట్రాన్స్‌ఫార్మర్ సమీపం వద్దకు వెళ్లాయి. ఈక్రమంలో నెలపై ఉన్న ట్రాన్స్ ఫార్మర్ ఎర్త్ పైపు వైరు తగిలి నాలుగు గేదెలు, ఒక దూడ అక్కడికక్కడే మృతి చెందాయి. మృతి చెందిన గేదెల విలువ రూ.5లక్షల వరకు ఉంటుందని బాధిత రైతులు పేర్కొన్నారు. వెటర్నరీ సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని, మృతి చెందిన గేదెలకు పంచనామా నిర్వహించారు.



విద్యుదాఘాతంతో మృతి చెందిన గేదెలు

రంపచోడవరంలో

227 పోలింగ్ కేంద్రాల్లో టీడీపీ హవా

● ఏడు మండలాల్లో టీడీపీ, నాలుగు మండలాల్లో వైసీపీ

(రంపచోడవరం)

రంపచోడవరం ఎస్టీ రిజర్వుడు నియోజకవర్గంలో మూడు ఎన్నికల అనంతరం తెలుగుదేశంపార్టీకి విజయాన్ని కట్టబెట్టిన ఇక్కడి ఓటర్లు ఇక్కడున్న మొత్తం 11 మండలాల్లో ఏడు మండలాలు తెలుగుదేశంవైపు నిలవగా, నాలుగు మండలాలు వైసీపీ వైపు నిలిచాయి. ఈ 11 మండలాల్లో ఉన్న మొత్తం 398 పోలింగ్ కేంద్రాలలో ప్రధాన పార్టీలకు వచ్చిన ఓట్లను పరిశీలిస్తే రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి, కూనవరం, వి.ఆర్.పురం మండలాలు తెలుగుదేశానికి అండగా నిలిచాయి. ఎటపాక, చింతూరు, మారేడుమిల్లి, వై.రామవరం మండలాలు మాత్రం వైసీపీ పక్షాన నిలిచాయి. అంటే పూర్వపు రంపచోడవరం ఏడు మండలాలలో ఐదు మండలాలు టీడీపీకి, నాలుగు విలీన మండలాలలో రెండు మండలాలు వైసీపీకి దక్కాయి. అనధికార సమాచారం ప్రకారం పోలింగ్ కేంద్రాలలో టీడీపీ, వైసీపీ పార్టీలకు దక్కిన ఓట్లను మండలాల వారీగా విభజిస్తే తెలుగుదేశానికి వచ్చిన 9,015 ఓట్ల మెజారిటీ రంపచోడవరం, దేవీపట్నం, గంగవరం, అడ్డతీగల, వై.రామవరం, రాజఒమ్మంగి, కూనవరం, వి.ఆర్.పురం మండలాల నుంచే దక్కింది. ఇక 398 పోలింగ్ కేంద్రాలలో 228 కేంద్రాలలో టీడీపీ తన ఆధిక్యతను కనబర్చింది.

సర్పంచ్‌కు తెలియకుండా నిధులు విత్‌డ్రా....?

● 15వ ఆర్థిక సంఘం నిధుల్లో గోల్‌మాల్ ?

రాజమహేంద్రవరంరూరల్, జూన్ 7: నిన్నటి వరకు గత ప్రభుత్వానికి కొమ్ముకాసిన పంచాయతీ అధికారులు నేడు మరలా పెత్తనం చెలాయించడానికి, అదే గ్రామాల్లో కొనసాగేందుకు ఇప్పటి నుంచే పైరవీలు మొదలుపెట్టారు. కడియం మండలంలో గ్రేడ్-3 మహిళా కార్యదర్శులు ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న గ్రామాల్లో అవినీతికి పాల్పడుతున్నారని పలువురు బాహాటంగా చెబుతున్నారు. బిల్డింగ్ ప్లాన్‌కి సంబంధించి గృహనిర్మాణదారుడు పంచాయతీకి తగిన రుసుము చెల్లించాల్సి ఉంటుంది. గృహనిర్మాణదారుడు చెల్లించిన రుసుములో కొంతమాత్రం సొమ్ముకు చెల్లని రశీదు ఇచ్చి మిగతా సొమ్ములను పంచాయతీ ఆదాయానికి గండి కొడుతున్నారని ఆరోపిస్తున్నారు. మమ్మల్ని ఎవర్రా ఆపేది అంటూ ఇన్నాళ్లుగా మండలస్థాయి రాజకీయ నాయకులను అధికారులను అడ్డుపెట్టుకుని ఇష్టానుసారంగా వ్యవహరించారని ఆరోపణలు లేకపోలేదు. ఎం-బుక్‌లు, బిల్లులపై సర్పంచ్ సంతకం కూడా లేకుండా ఎటువంటి పనులు చేయని వాటికి కూడా అంతా తామై డీఎస్ విధానాన్ని(డిజిటల్ సైన్) అడ్డుపెట్టుకుని పంచాయతీకి సంబంధించి 15వ ఆర్థికసంఘం నిధులు అవకతవకలు పాల్పడినట్లు స్వాహా ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై జిల్లాస్థాయి అధికారులు లోతుగా పరిశీలించి సమగ్ర నివేదిక తయారుచేసి పంచాయతీకి రావాల్సిన నిధులను సమకూర్చి సంబంధిత గ్రేడ్-3 పంచాయతీ కార్యదర్శులను చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.


eGramSwaraj

Payment Voucher Detail

నిధులు విత్‌డ్రాకు సంబంధించిన వివరాలు



మధురపూడి ఎయిర్‌పోర్టు వద్ద హీరో రామ్‌చరణ్‌కు స్వాగతం పలుకుతున్న అభిమానులు

బొబ్బర్లంక-రావులపాలెం మార్గంలో

ట్రాఫిక్ మళ్లింపు

● సినీ హీరో షూటింగ్ నిమిత్తం నేడు, రేపు ట్రాఫిక్ ఆంక్షలు

ఆత్రేయపురం, జూన్ 7: ప్రముఖ సినీ హీరో షూటిం గ్ నిమిత్తం మండలంలోని బొబ్బర్లంక-రావులపాలెం ఆర్ అండ్‌బీ రహదారిలో ఈ నెల 8, 9 తేదీల్లో ట్రాఫిక్‌ను మళ్లిస్తున్నట్టు రావులపాలెం సీఐ ఎం.రామ్‌కుమార్ తెలిపా రు. బొబ్బర్లంక నుంచి రావులపాలెం వైపు వెళ్లే నాలుగు చక్రాల వాహనాలు, భారీ వాహనాలు, కార్లు, లారీలు, బస్సులు, ట్రాక్టర్లు ధవళేశ్వరం బ్యారేజీని దాటుకుని వేమగిరి, జొన్నాడ మీదుగా రావులపాలెం చేరుకోవాలన్నారు. వాడపల్లి ఆలయానికి ద్విచక్ర వాహనాల్లో వెళ్లవచ్చన్నారు. రావులపాలెం హైవే, వేమగిరి మీదుగా బొబ్బర్లంక చేరుకోవాలన్నారు. ద్విచక్రవాహనచోదకులు బొబ్బర్లంక-రావులపాలెం రహదారి మీదుగా రాకపోకలు సాగించవచ్చని సీఐ చెప్పారు.

గేమ్ చేంజర్ సినిమా సందడి

ఆత్రేయపురం మండలం బొబ్బర్లంక పరిసర ప్రాంతాలలో హీరో రామ్‌చరణ్ నటిస్తున్న గేమ్ చేంజర్ సినిమా షూటింగ్ సన్నివేశాలు రెండు రోజులపాటు చిత్రీకరించనున్నారు. ఈ షూటింగ్ సన్నివేశాలకు సంబంధించిన ఏర్పాట్లు చురుగ్గా నిర్వహిస్తున్నారు. అలాగే షూటింగ్ నిమిత్తం హీరో రామ్‌చరణ్ శుక్రవారం రాత్రి రాజమహేంద్రవరంలోని మధురపూడి ఎయిర్‌పోర్టుకు నుంచి బయలుదేరి షెల్టాన్ హోటల్‌కు చేరుకున్నారు.

రేపు పిఠాపురంలో

ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఆర్చరీ పోటీలు

పిఠాపురం, జూన్ 7: కాకినాడ జిల్లా పిఠాపురం ఆర్ఆర్‌బీహెచ్‌ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో ఈనెల 9న మధ్యాహ్నం ఉమ్మడి తూర్పుగోదావరిజిల్లా ఆర్చరీ పోటీలు జరుగుతాయని ఉమ్మడి జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జేఎన్ఎస్ గోపాలకృష్ణ, పి.లక్ష్మణరావులు తెలిపారు. పోటీలు అండర్ 10, 13,15 ఏజ్ గ్రూపుల్లో ఇండియన్, రికార్వ్, కాంపౌండ్ విభాగాల్లో జరుగుతాయని చెప్పారు. అండర్ 10 విభాగంలో పాల్గొనే వారు 2015 జనవరి 1 తర్వాత జన్మించిన వారు, అండర్-13లో 2012 జనవరి 1 తర్వాత, అండర్-15లో 2010 జనవరి 1 తర్వాత పుట్టిన వారు అర్హులని వివరించారు. పోటీల్లో పాల్గొనే వారు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాకు చెందిన వారై ఉండి, ఆధార్‌కార్డు జిరాక్స్, పుట్టినరోజు ధ్రువీకరణపత్రం జిరాక్స్‌లు తీసుకురావాలని తెలిపారు. వివరాలు కోసం అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పి.లక్ష్మణరావును సెల్: 9989001162లో సంప్రదించాలని సూచించారు.

మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ ముగింపు

● ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత



ముగింపు కార్యక్రమంలో మాట్లాడుతున్న పీడీజే గంధం సునీత

రాజమహేంద్రవరం, జూన్ 7(ఆంధ్రజ్యోతి): మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ శుక్రవారంతో ముగిసిందని ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్‌పర్సన్ గంధం సునీత అన్నారు. ఈనెల 3న మధ్యవర్తిత్వ తర్ఫీదు శిక్షణ ప్రారంభించారు. ఢిల్లీ నుంచి వచ్చిన సీనియర్ శిక్షకులు వినయ్‌కుమార్ గుప్తా, సునీల్‌కుమార్ అగర్వాల్ ఉమ్మడి తూర్పు, పశ్చిమగోదావరి, కృష్ణా జిల్లాలకు చెందిన 30 మంది న్యాయాధికారులకు 40గంటల పాటు తర్ఫీదు ఇచ్చారు. ఈ శిక్షణలో నేర్పించిన మెలకువలవల్ల మధ్యవర్తిత్వంలో న్యాయాధికా రులకు మంచి నైపుణ్యం లభించిందని భావిస్తున్నామన్నారు. అనంతరం వినయ్‌కుమార్ గుప్తా, సునీల్‌కుమార్ అగర్వాల్‌ని పీడీజే సత్కరించారు.

రోడ్డు ప్రమాదంలో కంటైనర్ డ్రైవర్ మృతి

గొల్లప్రోలు రూరల్, జూన్ 7: రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన కంటైనర్ డ్రైవర్ చికిత్స పొందుతూ మరణించాడు. ఒడిస్సా రాష్ట్రంలోని మహిమాడిపూర్ సమీపంలోని జగత్‌సింగ్‌పూర్ దున్‌షాహి ప్రాంతానికి చెందిన డిబకర్ దాస్ కాకినాడలోని బీ 1కంపెనీలో కంటైనర్ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. కాకినాడ జిల్లా తాళ్లరేవు నుంచి రొయ్యలలోడు వేసుకుని భువనేశ్వర్ వెళ్లిన దాస్ అన్‌లోడింగ్ తర్వాత తిరిగి ప్రయాణమయ్యాడు. గొల్లప్రోలు మండలం చేబ్రోలువద్దకు వచ్చేసరికి శుక్రవారం ఉదయం 5గంటల సమయంలో ముందు వాహనం బ్రేక్ వేయడంతో తప్పించబోయి ఎదురుగా వస్తున్న వాహనాన్ని ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో దాస్‌కు తీవ్రగాయాలు కాగా కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించగా, చికిత్స పొందుతూ మరణించాడు. గొల్లప్రోలు ఎస్ఐ బాలాజీ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

డివైడర్‌ను ఢీకొని

దంపతులకు తీవ్ర గాయాలు

ప్రత్తిపాడు, జూన్ 7: కాకినాడ జిల్లా ప్రత్తిపాడు జాతీయ రహదారిపై శుక్రవారం జరిగిన రెండు వేర్వేరు రోడ్డు ప్రమాదాల్లో దంపతులతో పాటు మరో వ్యక్తి గాయపడ్డారు. అన్నవరం నుంచి రాజమహేంద్రవరం బైక్‌పై వెళుతున్న రాజమహేంద్రవరానికి చెందిన దంపతులు ధర్మవరం కోల్డ్ స్టోరేజ్‌వద్ద బైక్ అదుపు తప్పి డివైడర్‌ను ఢీకొనడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. ఈ దంపతులను స్థానిక ప్రభుత్వాసుపత్రిలో చికిత్స చేయించి మెరుగైన వైద్యం కోసం కాకినాడకు తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు. అలాగే ప్రత్తిపాడుకు చెందిన మరో వ్యక్తి స్కూటీపై రాచపల్లి వెళుతుండగా మినర్వా కళాశాల సమీపంలోని సుద్దగడ్డ వాగు దిగువున అదుపు తప్పి రహదారిపై పడిపోవడంతో తీవ్ర గాయాలు కావడంతో అంబులెన్స్‌లో స్థానిక ఆసుపత్రికి తరలించారు.



తీవ్రగాయాలైన దంపతులను ఆసుపత్రికి తరలిస్తున్న దృశ్యం

కాకినాడ

ఈఎల్ఎస్ఆర్‌లను సందర్శించిన కమిషనర్

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 7: నగరంలో ఎలివేటెడ్ సర్వీస్ రిజర్వాయర్లను(ఈఎల్ఎస్ఆర్) నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు శుక్రవారం సందర్శించారు. ఎస్ఈ పి.సత్యకుమారి, ఇతర అధికారులతో కలిసి దుమ్ములపేట, సాంబమూర్తినగర్, ఏఎంజీ స్కూల్ ప్రాంతాల్లో పర్యటించి నీటి నమూనాలను పరిశీలించారు. నీటి నాణ్యతపై సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయన వెంట ఈఈ మాధవి,ఏఈ వై.నాగేశ్వరరావు, కార్యదర్శులు ఉన్నారు.

'ఇందిరాగాంధీ రికార్డు అధిగమించనున్న మోదీ'

కార్పొరేషన్ (కాకినాడ), జూన్ 7: కేంద్రంలో నరేంద్ర మోదీ ప్రధానిగా మూడోసారి బాధ్యతలు చేపట్టడం ద్వారా ఇందిరాగాంధీ రికార్డును అధిగమించనున్నారని కాకినాడ జిల్లా బీజేపీ అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, మీడియా ప్యానలిస్టు దువ్వూరి సుబ్రహ్మణ్యం అన్నారు. శుక్రవారం కాకినాడలో వారు మాట్లాడుతూ కేంద్రం, రాష్ట్రంలో ఎన్డీఏకు అనుకూలంగా ప్రజలు తీర్పునివ్వడం పట్ల ఆనందం వ్యక్తం చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి దేశాన్ని, రాష్ట్రాన్ని మరింత ప్రగతి పథంలో నడిపించే అవకాశం ప్రజాతీర్పు కల్పించిందన్నారు. రాష్ట్రంలో చంద్రబాబు సారధ్యంలో ఎన్డీఏ ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్‌కు జీవనాధారమైన పోలవరం నిర్మాణం, ప్రజల ఆకాంక్షకు అనుగుణంగా రాజధాని అమరావతి నిర్మాణం వంటి అంశాల్లో శరవేగంతో ముందుకు సాగగలరన్నారు. అరాచక పాలన అంతమొందించే విషయంలో కీలకపాత్ర పోషించిన జనసేన నేత పవన్‌కల్యాణ్‌కు బీజేపీ నేతలు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. పవన్‌కల్యాణ్ రాజకీయాల్లో కూడా హీరోగా నిలిచారని వ్యాఖ్యానించారు.

'భారత్ అభివృద్ధికి మోదీ కృషి'

సర్పవరం జంక్షన్, జూన్ 7: అగ్రదేశాలకు దీటుగా భారతదేశాన్ని అన్నిరంగాల్లో ప్రధాని మోదీ అభివృద్ధి చేస్తున్నారని బీజేపీ జిల్లా పార్లమెంట్ కన్వీనర్ రంబాల వెంకటేశ్వరరావు అన్నారు. న్యూఢిల్లీలో జరిగిన సమావేశంలో ఎన్డీఏ పక్ష నేతగా మోదీని ఎన్నుకున్న సందర్భాన్ని పురస్కరించుకుని శుక్రవారం సురేష్‌నగర్ పార్టీ కార్యాలయంలో ప్రధాని మోదీ ప్రసంగాన్ని లైవ్‌లో పార్టీ నాయకులతో కలసి వీక్షించారు. బీజేపీ కేంద్రంలో మూడోసారి హ్యాట్రిక్ విజయం సొంతం చేసుకుని ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న తరుణంలో ఒకరికొకరు శుభాకాంక్షలు తెలిపి స్వీట్లు పంపిణీ చేశారు. పార్టీ నాయకులు కొమ్మిరెడ్డి సతీష్, కవికొండల భీమశేఖర్, పెండెం బాబ్జి, నందూరి సత్తిబాబు, అనపర్తి వెంకటేష్, పాలుపల్లి లక్ష్మణరావు పాల్గొన్నారు.

'నాయకులు, కార్యకర్తలు దాడులకు పాల్పడొద్దు'

జగ్గంపేట, జూన్ 7: ఎన్డీయే నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఎక్కడ దాడులకు పాల్పడవద్దు.. సంయమనం పాటించాలని జగ్గంపేట ఎమ్మెల్యేగా గెలిచిన జ్యోతుల నెహ్రూ సూచించారు. స్థానిక టీడీపీ కార్యాలయంలో శుక్రవారం విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు మనకు తిరుగులేని విజయాన్ని ఇచ్చినందున ఆనందంతో విజయోత్సవాలు జరుపుకోవాలే తప్ప భౌతికదాడులు, ఆస్తులపై దాడులు చేయవద్దన్నారు. గత ఐదేళ్లుగా రాష్ట్రంలో చేసిన అరాచకాలకు ఫలితంగానే ప్రజలు ఇంతటి తీర్పునిచ్చారని అందువల్ల ఎన్డీయే భాగస్వాములైన ప్రతీ ఒక్కరు సమన్వయంతో ముందుకు సాగాలన్నారు. టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, నియోజకవర్గ తెలుగు రైతు అధ్యక్షులు వీరంరెడ్డి కాశిబాబు, ఎస్సీ సెల్ అధ్యక్షులు గుడాల రాంబాబు, కిర్లంపూడి మండల తెలుగు రైతు అధ్యక్షులు కాకిలేటి రాయుడు ఉన్నారు.

'ఎన్నికల్లో ప్రజా తీర్పును గౌరవిస్తున్నాం'

పెద్దాపురం, జూన్ 7: సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు ఇచ్చిన తీర్పును తాము గౌరవిస్తున్నామని మున్సిపల్ వైస్ చైర్మన్ నెక్కంటి సాయిప్రసాద్ అన్నారు. స్థానిక గోలి వారి వీధిలో ఆయన స్వగృహంలో శుక్రవారం వైసీపీ కార్యకర్తలు, కౌన్సిలర్లతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. గడచిన ఐదేళ్లలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సంక్షేమం చేపట్టామన్నారు. ఎన్నికల్లో ఓటమి చవిచూసినా కార్యకర్తలు ఎవరూ అధైర్యపడవద్దన్నారు. ఎవరు ఎంత రెచ్చగొట్టేలా ప్రవర్తించినా తాము సంయమనంతో ఉంటామని, తమ సహనానికి హద్దు ఉంటుందన్నారు. తాము అన్నింటికీ సిద్ధంగా ఉన్నామని తెలిపారు. సమావేశంలో తాడి రాజశేఖర్, త్సలికి సత్యభాస్కరరావు, వాసంశెట్టి గంగ, విజ్జపు రాజశేఖర్, ఆరెళ్ల వీర్రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.

'కూలీలకు ఉపాధి కల్పించాలి'

కరప, జూన్ 7: ఉపాధిహామీ పథకం కింద కూలీలందరికీ పని కల్పించాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు టేకుమూడి ఈశ్వరరావు విజ్ఞప్తి చేశారు. ఎన్నికల కోడ్ నెపంతో అధికారులు ఇప్పటి వరకూ ఉపాధి పనులకు అనుమతులు ఇవ్వకుండా అన్యాయం చేయడంతో కరప, తాళ్లరేవు, కాజులూరు, పెదపూడి, సామర్లకోట తదితర మండలాల్లో కూలీలు ఉపాధి లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. గతంలో మాదిరిగా ఎక్కువ పనిదినాలు కల్పించడంలేదని, వెంటనే గుర్తించిన పనులకు అనుమతులు మంజూరు చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

'గ్రంథాలయాలు సరస్వతీదేవి నిలయాలు'

కొత్తపల్లి, జూన్ 7: గ్రంథాలయాలు సరస్వతీ దేవి నిలయాలని ఉప్పాడ సర్పంచ్ ఉమ్మిడి మేరీజాన్ అన్నారు. ఉప్పాడ, కొత్తపల్లి శాఖా గ్రంథాలయాల్లో గతనెల 15 నుంచి నిర్వహిస్తున్న వేసవి శిక్షణా శిబిరాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లను సర్పంచ్ పంపిణీ చేశారు. విద్యార్థులు గ్రం థాలయాల్లో విజ్ఞానం పొందే గ్రంథాలను పఠనం చేయాలని గ్రంథాలయ అధికారులు తుమ్మలపల్లి జయకృష్ణ, తెలగంశెట్టి నళినీ ప్రియ విజ్ఞప్తి చేశారు. విద్యార్థులకు వివిధ అంశాల్లో శిక్షణ ఇచ్చిన రీసోర్సుపర్సన్లకు అధికారులు జ్ఞాపికలను అందజేశారు.

'ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలి'

ఏలేశ్వరం, జూన్ 7: అందరూ ఆధ్యాత్మిక భావన కలిగి ఉండాలని జనసేన పార్టీ ప్రత్తిపాడు ఇన్‌చార్జి వరుపుల తమ్మయ్యబాబు అన్నారు. కాకినాడ శ్రీగణపతి సచ్చిదానంద స్వామి దత్త పీఠం నిర్వహించిన భగవద్గీత పోటీల్లో బంగారు పతకం సాధించిన గంటా సుధ దంపతులను శుక్రవారం లింగంపర్తిలో వివేకానందా సమితి, లలితా సత్సంగం మాతృమూర్తులు ఆధ్వర్యంలో శాలువా కప్పి, పూలమాలలు వేసి ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో షైరాల నాగేశ్వరరావు, తాట్యూరి గొల్లాజీ, పంతం పద్మనాభం, నల్లాల వీరబాబు, అద్దూరి కోటేశ్వరరావు, కుర్ర గోవిందు పాల్గొన్నారు.

శ్రీప్రకాష్‌లో 'అంపైర్స్ క్లినిక్'

పెద్దాపురం, జూన్ 7: స్థానిక రామారావుపేటలోని శ్రీప్రకాష్ సినర్జీస్ పాఠశాలలో ఈనెల 8నుంచి జరగనున్న రాష్ట్రస్థాయి టేబుల్ టెన్నిస్ టోర్నమెంటకు సంబంధించి శుక్రవారం అంపైర్స్ క్లినిక్ కార్యక్రమం నిర్వహించారు. పాఠశాల డైరెక్టర్, ఏపీటీటీఏ వైస్ ప్రెసిడెంట్ సీహెచ్.విజయ్‌ప్రకాష్ మాట్లాడుతూ అంపైర్స్ క్లినిక్‌లో భాగంగా టీటీ అంపైర్లకు శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. ఈ శిక్షణకు సుమారు 25 మంది అంపైర్లు హాజరయ్యారు. వారికి నియయాలపై అవగాహన కల్పించి సర్టిఫికెట్లను ప్రదానం చేశారు. డీఎస్ఆర్ కుమార్, డీవీఎస్‌వై శర్మ, ఏవీఎస్ సింగరాజు పాల్గొన్నారు.

బీజేపీ నాయకుల సంబరాలు

ప్రత్తిపాడు, జూన్ 7: ఎన్డీయే పక్ష నేతగా నరేంద్రమోదీ 3వ సారి ప్రధాని పదవి చేపట్టేందుకు ఎన్నిక కావడాన్ని పురస్కరించుకుని శుక్రవారం ప్రత్తిపాడులో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ప్రధాన రహదారి మార్కెట్ సెంటర్‌లో నాయకులు, కార్యకర్తలు బాణసంచా కాల్చి స్వీట్లు పంచారు. జిల్లా కిసాన్ మోర్చ అధ్యక్షుడు సింగిలిదేవ్ సత్తిరాజు, ఎస్టీ మోర్చ జిల్లా అధ్యక్షుడు కించు జోగిరాజు, బీజేపీ మండల ప్రధాన కార్యదర్శి మదినే బాబ్జి, బీజేపీ నాయకులు రాజా కింగ్‌బాబురాజు, అప్పిరెడ్డి నూకరాజు, పి.శ్రీనివాస్, పొదురుపాక బాబ్జి, కె.నాగేశ్వరరావు, చొల్లపల్లి శ్రీను ఉన్నారు.

మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన

పెద్దాపురం, జూన్ 7: మరిడమ్మకు బంగారు, వెండి పుష్పాలతో అర్చన కార్యక్రమం శుక్రవారం దేవస్థానం వేదపండితుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేగా నిమ్మకాయల చినరాజప్ప మూడోసారి ఘన విజయాన్ని సాధించడంతో మున్సిపల్ మాజీ చైర్మన్ రాజాసూరిబాబురాజు ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం సహాయ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆలయ మర్యాదలతో ఆయనకు ఘన స్వాగతం పలికారు. వేదాశీర్వచనాలతో పాటు ప్రసాదాలను అందచేశారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు రంధి సత్యనారాయణ పాల్గొన్నారు.

కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ రాజీనామా

జగ్గంపేట, జూన్ 7: జగ్గంపేట కో ఆపరేటివ్ బ్యాంక్ చైర్‌పర్సన్ బుర్రి చక్రబాబు శుక్రవారం రాజీనామా చేశారు. వైసీపీ ప్రభుత్వం ఎన్నికల్లో ఓటమి పాలవడంతో పదవికాలం కూడా ఒక నెలలోముగియడంతో ఈ పదవి నుంచి తప్పుకున్నట్లుగా అధికారులకు రాతపూర్వకంగా అధికారులకు అందజేశారు. అలాగే ది జగ్గంపేట లార్జ్ సీజ్ కో ఆపరేటివ్ క్రెడిట్ సొసైటీ లిమిటెడ్ చైర్మన్ బుర్రి విష్ణుచక్రం పదవికి రాజీనామా చేశారు. రాజీనామా లేఖను పెద్దాపురం డిప్యూటీ రిజిస్టర్‌కు శుక్రవారం అందజేశారు.

నాదెండ్లను కలిసిన మల్లాడి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 7: తెనాలి ఎమ్మెల్యే నాదెండ్ల మనోహర్‌ను శుక్రవారం కాకినాడ పార్లమెంట్ ఎన్నికల కమిటీ సభ్యుడు డాక్టర్ మల్లాడి రాజేంద్రప్రసాద్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మనోహర్‌తో తనకు 20ఏళ్ల అనుబంధం ఉందన్నారు. సంగాని బాలమహేశ్వరరావు, వీరెల్లి ఏసు, గండి సుబ్బరాజు, దోని చిట్టిబాబు పాల్గొన్నారు.

లారీని ఢీకొన్న కారు - పలువురికి గాయాలు

కాకినాడ రూరల్, జూన్ 7: రూరల్ మండలం చీడిగ హైవే వంతెన వద్ద ఆగి ఉన్న లారీని తూరంగి వైపు నుంచి వస్తున్న ఎర్టిగా కారు శుక్రవారం తెల్లవారు జామున ఢీకొన్న సంఘటనలో పలువురికి గాయాలైనట్టు ఇంద్రపాలెం ఎస్ఐ మణికుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... కైట్ ఇంజనీరింగ్ కళాశాలలో చదువుతున్న ఆరుగురు విద్యార్థులు కారు బుక్‌చేసుకుని సామర్లకోట భీమేశ్వరస్వామి, అన్నవరం సత్యనారాయణస్వామిని దర్శించుకునేందుకు వెళ్తున్నారని, చీడిగ వంతెన వద్దకు వచ్చేసరికి కారును టర్నింగ్ తిప్పబోయి ఆగి ఉన్న లారీని ఢీకొట్టారన్నారు. కారులో ప్రయాణిస్తున్న వారిలో ఎంజీ మణికంఠ తలకు బాగా గాయం కాగా, మరొక విద్యార్థికి స్వల్పంగా గాయాలయ్యాయని కాకినాడ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారన్నారు. జయకృష్ణ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

ఉమారామలింగేశ్వరస్వామి

విజేతలకు అభినందనలు



గండేపల్లి: మల్లేపల్లిలో నెహ్రూకు పటికి బెల్లంతో తులాభారం



ప్రత్తిపాడులో సత్యప్రభను గజమాలతో సత్కరిస్తున్న నాయకులు



సర్పవరం జంక్షన్: నానాజీని కలుసుకున్న కాకినాడ కమిషనర్



కాకినాడ సిటీ: కొండబాబును శాలువాతో సత్కరిస్తున్న దృశ్యం

జగ్గంపేట, జూన్ 7: జగ్గంపేట ఎమ్మెల్యేగా రికార్డు మెజార్టీతో చరిత్ర సృష్టించిన జ్యోతుల నెహ్రూను జిల్లా టీడీపీ ఎస్సీ సెల్ కార్యనిర్వహణ కార్యదర్శి దారా యేసురత్నం జగ్గంపేట టీడీపీ కార్యాలయంలో శుక్రవారం సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. నెహ్రూకు మంత్రివర్గంలో చోటు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో దళితగళం టీం సభ్యులు పాల్గొన్నారు. జ్యోతుల నెహ్రూకు జై భీమ్ రావ్ భారత్ పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జ్ వల్లూరి సత్యానందం శుభాకాంక్షలు తెలిపారు. శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేశారు. అలాగే జ్యోతుల నెహ్రూను పెద్దాపురం ఆర్డీవో సీతారామరాజు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

గండేపల్లి: మల్లేపల్లిలో జాతీయరహదారి పక్కన వెలసిన అభయాంజనేస్వామి ఆలయం వద్ద గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు, ఉపసర్పంచ్ దొమ్మా శ్రీను జ్యోతుల నెహ్రూకు పటికిబెల్లంతో తులాభారం నిర్వహించారు. శ్రీను మాట్లాడుతూ ఎన్నికల్లో నెహ్రూ అత్యధిక మెజార్టీతో గెలుపొందాలని మొక్కుకుని చెల్లించుకున్నానన్నారు. నెహ్రూకు మంత్రి వర్గంలో సముచితం స్థానం కల్పిస్తే ఆయన మంత్రి అయ్యాక చిల్లర డబ్బులతో మళ్లీ తులాభారం వేస్తానని మొక్కుకున్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పోతుల మోహనరావు, రాష్ట్ర కార్యదర్శి ఎస్వీఎస్ అప్పలరాజు, మారిశెట్టి భద్రం, పరిమి బాబు, యువనాయకులు జాస్తి వసంత్, కందుల చిట్టిబాబు, కుంచే రాజా, అడబాల భాస్కరరావు, గ్రామ పార్టీ అధ్యక్షుడు తెలగరెడ్డి భద్రరావు, కాటేపల్లి భద్రం, దిడ్డి చినశ్రీను, పిల్లా సత్యనారాయణ, పోతుల దుర్గాప్రసాద్ పాల్గొన్నారు.

సత్యప్రభకు శుభాకాంక్షలు

ప్రత్తిపాడు, జూన్ 7: ప్రత్తిపాడు ఎమ్మెల్యేగా ఘన విజయం సాధించిన వరుపుల సత్యప్రభ రాజాను ఏలేశ్వరం, ప్రత్తిపాడు, శంఖవరం, రౌతులపూడి మండలాల నుంచి ద్విచక్రవాహనాలు, ర్యాలీలు, చిన్నకారులు, ఆటోల ద్వారా అభిమానులు, నాయకులు తరలివచ్చి అభినందించారు. ఏలేశ్వరం ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, బొదిరెడ్డి గోపాలకృష్ణ, మహిళలు సత్యప్రభను గజమాలతో సన్మానించారు. నియోజకవర్గంలోని పోలీస్ అధికారులు, సీఐ ఎం.శేఖర్‌బాబు, ఎస్ఐలు ఎం.పవన్‌కుమార్, సతీష్ మర్యాదపూర్వకంగా కలిసి బొకేలు అందజేసి అభినందించారు. ధర్మవరానికి చెందిన టీడీపీ నాయకుడు బొల్లు కొండబాబు, దాట్ల అప్పన్నబాబు, రౌతులపూడి, రాచపల్లికి చెందిన కోళ్ళ రవి, బుద్దరాజు చంటిరాజు, నూకరాజు సత్యప్రభను అభినందించారు. బీజేపీ నాయకుడు గంటా బాలుదొర ఆధ్వర్యంలో గన్నాబత్తుల రాజబాబు, గట్టెం వెంకటరమణ, వెలుగూరి హరేరాం, కందా వీరాస్వామి, రెడ్డి లోవరాజు, ఊటా శ్రీను, బీజేపీ కార్యకర్తలు సత్యప్రభను అభినందించారు.

ఏలేశ్వరం: ప్రత్తిపాడులో సత్యప్రభ నివాసం వద్ద ఎంపీపీ గొల్లపల్లి బుజ్జి, కౌన్సిలర్ బొదిరెడ్డి గోపీ ఆధ్వర్యంలో సత్యప్రభను గజమాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం పెద్దనాపల్లి గ్రామం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు సమక్షంలో భారీ కేక్ కట్ చేసి స్థానికులకు పంచారు.

రౌతులపూడి: సత్యప్రభకు అభినందనలు తెలిపేందుకు మండల గ్రామాల నుంచి భారీగా టీడీపీ నేతలు తరలివెళ్లారు. రౌతులపూడి నుంచి ఎంపీపీ గంటిమళ్ల రాజ్యలక్ష్మి, గుమ్మరేగుల నుంచి పసగడుగుల రమణ, శృంగవరం నుంచి లొండా దేవుళ్లు, అల్లు నూకరాజు, దిగిశివాడ నుంచి పంచాడ బుజ్జీ, బంగారయ్యపేట నుంచి ఉండ్రాజు దివాణం ఆధ్వర్యంలో భారీ తరలివెళ్లారు. అలాగే ఎంఈవోలు గాడి కొండబాబు, శ్రీనివాసరావు సత్యప్రభకు అభినందనలు తెలిపారు.

నానాజీని కలిసిన నాయకులు

సర్పవరం జంక్షన్, జూన్ 7: కాకినాడ రూరల్ ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో విజయం సాధించిన పంతం వెంకటేశ్వరరావు (నానాజీ)ని శుక్రవారం గొడారిగుంట నివాసంలో కార్పొరేషన్ కమిషనర్ ఎం.వెంకట్రావు, అదనపు కమిషనర్ నాగనరసింహరావు, ఎస్ఈ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ జి.శేఖర్, విద్యా శాఖ ఆర్జేడీ నాగమణి, హౌసింగ్ పీడీ సత్యనారాయణ, ఏఈ కె.నాగభూషణరావు కలిసి పుష్పగుచ్ఛాలు, బొకేలు, గజమాలలతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలిపారు. జిల్లా పంచాయతీ కార్యదర్శుల సంఘం అధ్యక్షులు జొన్నాడ నరసింహరావు ఆధ్వర్యంలో పంచాయతీ కార్యదర్శులు నానాజీని కలుసుకుని అభినందనలు తెలిపారు. పంతం నానాజీ కృతజ్ఞతా పర్యటనలో భాగంగా శుక్రవారం వలసపాకలలో మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మిసత్యనారాయణమూర్తిదంపతుల నివాసానికి వెళ్లి వారిని ఘనంగా సత్కరించారు. జనసేన అభ్యర్థిగా తన గెలుపు కోసం పిల్లి దంపతులు అలుపెరగని ప్రచారం చేసి అఖండ మెజారిటీ వచ్చేలా కృషి చేశారని కితాబిచ్చారు. నానాజీ పెళ్లిరోజు పురస్కరించుకుని నానాజీ దంపతులను మాజీ ఎమ్మెల్యే దంపతులు ఘనంగా సత్కరించారు. అనంతరం నానాజీ తన విజయం కోసం కృషి చేసిన టీడీపీ కో కోఆర్డినేటర్ కటకంశెట్టి ప్రభాకర్(బాబీ), ఎన్నికల కోఆర్డినేటర్ నులుకుర్తి వెంకటేశ్వరరావు, పాయకరావుపేట కోఆర్డినేటర్ డాక్టర్ చప్పిడి వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి పెంకే శ్రీనివాస బాబా, రాష్ట్ర కార్యదర్శి వాసిరెడ్డి ఏసుదాసుల నివాసానికి వెళ్లి కృతజ్ఞతలు తెలిపారు.

కొండబాబుకు సత్కారాలు

కాకినాడ సిటీ, జూన్ 7: జిల్లాలోని ఉద్యోగ ఉపాధ్యాయ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఏపీఎన్జీవో అసోసియేషన్ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జి.రామ్మోహనరావు, పేపకాయల వెంకటకృష్ణ కోరారు. ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా కార్యవర్గం ప్రతినిధులు శుక్రవారం కాకినాడ సిటీ ఎమ్మెల్యే విజేత వనమాడి కొండబాబును మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి పుష్పగుచ్ఛం అందజేశారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు పసుపులేటి శ్రీనివాసు, సహాధ్యక్షుడు మట్టపర్తి వెంకటేశ్వరరావు, సంయుక్త కార్యదర్శి కె.వీరబాబు, కాకినాడ నగర అధ్యక్షుడు అరదాడి సత్తిరాజు, ఉపాధ్యక్షుడు కె.జాన్‌పాల్, ఇతర కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు. వనమాడి కొండబాబును కాకినాడ నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు, ఇతర విభాగాల అధికారులు కలిసి అభినందనలు తెలిపారు. వివిధ స్టేషన్ల పోలీస్ అధికారులు మర్యాదపూర్వకంగా కలిశారు. రూరల్ టీడీపీ నాయకుడు నులుకుర్తి వెంకటేశ్వరరావు, జనసేన నాయకుడు అకుల వెంకటరమణ కలిసి అభినందనలు తెలిపారు వివిధ డివిజన్లకు చెందిన నాయకులు, పార్టీశ్రేణులు కలిసి పుష్పగుచ్ఛాలు అందజేశారు. కార్యక్రమాల్లో టీడీపీ నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, జనసేన నాయకుడు సంగిశెట్టి అశోక్ పాల్గొన్నారు.



కరపలో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న జనసేన, టీడీపీ నాయకులు



గొల్లప్రోలులో కొబ్బరి కాయలు కొట్టి మొక్కు తీర్చుకుంటున్న జనసైనికులు

కూటమి విజయంపై సంబరాలు

కరప, జూన్ 7: కరపలో శుక్రవారం జనసేన, టీడీపీ నాయకులు విజయోత్సవ ర్యాలీని నిర్వహించారు. పంచాయతీ కార్యాలయం నుంచి ర్యాలీ ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ఓటర్లను మర్యాదపూర్వకంగా కలిసి మిఠాయిలు పంచిపెట్టారు. కాకినాడరూరల్ నుంచి జనసేన అభ్యర్థి పంతం నానాజీ భారీ విజయం సాధించడానికి కారణమైన ఓటర్లకు కృతజ్ఞతలు తెలిపారు. మాజీ సర్పంచ్ పోలిశెట్టి తాతీలు, నాయకులు యాళ్ల పండు, నిమ్మకాయల సత్తిబాబు, నక్కా సాంబయ్య, చిన్నారి శ్రీను, కోన వెంకటలక్ష్మి, జెల్లా శివకుమార్, భగవాన్, ప్రసాద్, నాగభూషణం పాల్గొన్నారు.

జగ్గంపేట: జగ్గంపేట కూటమి అభ్యర్థి జ్యోతుల నెహ్రూ అత్యధిక మెజార్టీ గెలవడంతో పూర్తి మద్దతు ఇచ్చిన జగ్గంపేట జనసేన ఇన్‌చార్జ్ తుమ్మల పల్లి రమేష్‌ను కలిసి జనసైనికులు కలిసి పట్టణంలో అన్నివీధుల్లోను సంబరాలు నిర్వహించారు. బైరెడ్డి శ్రీనివాసు, గవర సుధాకర్, టీడీపీ మండలాధ్యక్షుడు మారిశెట్టి భద్రం, జగ్గంపేట నియోజకవర్గం కన్వీనర్ ఎస్వీఎస్ అప్పలరాజు, రాంబాబు తుమ్మలపల్లికి శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందనలు తెలిపారు.

మొక్కు తీర్చుకున్న జనసైనికులు

గొల్లప్రోలు, జూన్ 7: పిఠాపురం ఎమ్మెల్యేగా జనసేన అధినేత పవన్‌కల్యాణ్ విజయం సాధించడంతో జనసైనికులు, వీరమహిళలు గొల్లప్రోలు పట్టణంలోని విజయదుర్గమ్మ ఆలయం వద్ద కొబ్బరికాయలు కొట్టారు. ఆంజనేయస్వామికి పూజలు నిర్వహించారు.



నారా లోకేశ్‌ను అభినందిస్తున్న చినరాజప్ప

లోకేశ్‌ను అభినందించిన రాజప్ప

సామర్లకోట, జూన్ 7: పెద్దాపురం ఎమ్మెల్యేగా మూడోసారి అత్యధిక మెజార్టీతో గెలుపొందిన నిమ్మకాయల చినరాజప్ప శుక్రవారం అమరావతిలో టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేశ్, ఆయన తల్లి సతీమణి నారా భువనేశ్వరిలను మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందించారు. రాజప్పను వారు అభినందించారు. చినరాజప్ప వెంట బండారు సాగర్ కూడా ఉన్నారు.

లోకేశ్‌ను కలిసిన దివ్య



తుని రూరల్, జూన్ 7: తుని ఎమ్మెల్యేగా గెలిచిన యనమల దివ్య టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్‌ను ఉండవల్లిలో మర్యాదపూర్వకంగా కలిశారు. దివ్య గెలుపుపై అభినందనలు తెలిపారు.

పంతం పద్మనాభం విగ్రహానికి నివాళి

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 7: రాజకీయాల్లో నిస్వార్థంగా ప్రజలకు సేవలందించిన వ్యక్తి పంతం పద్మనాభమని, ఆయన స్ఫూర్తితో ముందుకు వెళ్తామని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే విజేత పంతం వెంకటేశ్వరరావు(నానాజీ) అన్నారు. కల్పన సెంటర్ వద్ద మాజీ మంత్రి పంతం పద్మనాభం విగ్రహానికి గౌరవార్థం జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులతో కలిసి నానాజీ శుక్రవారం పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఆయన మాట్లాడుతూ రాజకీయాల్లో ప్రజలకు సేవ చేసే వాళ్లు చాలా తక్కువమంది ఉంటారని, కానీ పంతం పద్మనాభం తన రెండువేల ఎకరాల భూమిని దళితులకు దానం చేసి ఎంతో కీర్తి ప్రతిష్టలు పొందారని అన్నారు. ఎన్నికల్లో కూటమికి పట్టం కట్టిన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. టీడీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు సుంకర పావని, నగర అధ్యక్షుడు మల్లిపూడి వీరు, టీడీపీ నేత నులుకుర్తి వెంకటేశ్వర, జనసేన నేతలు ఆకుల వెంకటరమణ, కరెడ్ల గోవిందు, సిరంగు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

క్రాఫ్ట్ బజార్ ప్రారంభం

కార్పొరేషన్(కాకినాడ), జూన్ 7: కాకినాడ డీసీసీ బ్యాంకు పక్కన క్రాఫ్ట్ బజార్ ఉన్న ఖాళీ స్థలంలో 50వేల వెరైటీస్ హస్తకళలు, చేనేత ఎంపోరియం క్రాఫ్ట్ బజార్ ఈనెల 7వ నుంచి 20రోజులు వరకు నిర్వహించనున్నారు. ఈ హస్తకళా ప్రదర్శన, అమ్మకాన్ని ప్రముఖ వ్యాపారవేత్త దుర్గా సోముప్రసాద్ శుక్రవారం ప్రారంభించారు. క్రాఫ్ట్‌బజార్ అధ్యక్షుడు సయేల్ మాట్లాడుతూ ఈ ప్రదర్శనలో హైదరాబాద్ మంచి ముత్యాలు, కలంకారీ, పెయింట్స్, మార్బుల్‌బొమ్మలు, సారంగపూర్ ఉడ్ కార్వింగ్ బ్లాక్ మెటల్, అగరుబత్తులు, ఏటికొప్పాక బొమ్మలు, బీడ్స్ జెవెల్లరీ కార్పెట్స్, రాజస్థాన్ బెడ్‌షీట్స్, బెంగాల్ కాటన్‌శారీస్, స్టోన్ ఫొటోలు, నైటీలు, బ్యాగులు, ఎన్నో రకాల వస్తువులు ఉంచామన్నారు.

అశోక్‌బాబుతో కూటమి శ్రేణుల భేటి

తుని రూరల్, జూన్ 7: మాజీ ఎమ్మెల్యే రాజా అశోక్ బాబును శుక్రవారం టీడీపీ కూటమి శ్రేణులు మర్యాదపూర్వకంగా కలిశారు. తుని కూటమి అభ్యర్థి యనమల దివ్యను భారీ మెజార్టీతో గెలిపించడంలో కీలకంగా వ్యవహరించిన రాజా అశోక్‌బాబు, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ కుసుమంచి శోభారాణి దంపతులకు కృతజ్ఞతలు తెలియజేసి అభినందనలు తెలిపారు. నేతలకు పార్టీ శ్రేణులు అభినందనలు తెలిపి శాలువాతో సత్కరించారు. అశోక్‌బాబును కలిసిన వారిలో చింతమనీడి నాగ సోమరాజు, బోనం చినబాబు, జక్కాన రామునాయుడు తదితరులు ఉన్నారు.

నియంతకు ఓటుతో బుద్ధిచెప్పిన ప్రజలు

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూన్ 7: అధికార మదంతో వ్యవస్థలను నాశనం చేసిన నియంతకు రాష్ట్ర ప్రజలు ఓటుతో బుద్ధి చెప్పి బంగాళాఖాతంలో విసిరివేశారని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పిఠాపురం నుంచి జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కూటమి అభ్యర్థుల గెలుపులో కీలకపాత్ర పోషించిన వర్మను శుక్రవారం పిఠాపురం టీడీపీ కార్యాలయంలో టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, జనసైనికులు, వీరమహిళలు కలిసి అభినందించి సత్కరించారు. పవన్, కూటమి అభ్యర్థుల గెలుపునకు కృషి చేస్తానని టీడీపీ అధినేత చంద్రబాబు, పవన్‌కు ఇచ్చిన మాట ప్రకారం అంకితభావంతో పనిచేసి మాట నిలబెట్టుకున్నానని వర్మ తెలిపారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తన మాటపై గౌరవంతో పవన్‌కు ఓటు వేశారని చెప్పారు. పెండెం దొరబాబు, వంగా గీత టీమ్ అంతా నిన్నటి వరకూ పవన్ ఓటమికి పనిచేసి, కూటమి పార్టీల నేతలపై దాడులు చేసినా ఇప్పుడు ఈ పార్టీల్లో చేరే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. ఇటువంటి వారి అవసరం కూటమి ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. వైసీపీ నేతలు వచ్చి పార్టీల కోసం ఐదేళ్లు కష్టపడి పనిచేసిన నాయకులకు నష్టం కలిగించాలని చూస్తున్నారని విమర్శించారు. ఇటువంటి వారి ప్రయత్నాలు సాగనివ్వబోమని స్పష్టం చేశారు. వర్మను కలిసిన వారిలో కూటమి పార్టీల నేతలు, అధికారులు ఉన్నారు.



పిఠాపురం: వర్మను అభినందిస్తున్న నేతలు

పిఠాపురం రూరల్: పిఠాపురం మండలం గోకివాడలో పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ పర్యటించారు. జనసేన అధినేత పవన్‌కల్యాణ్, కూటమి అభ్యర్థులకు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలియజేశారు. పవన్ విజయం కోసం పనిచేసిన వర్మను టీడీపీ, జనసేన నేతలు, కార్యకర్తలు, జనసైనికులు గజమాలలుతో సత్కరించారు. టీడీపీ మండలశాఖ అధ్యక్షుడు సకుమళ్ల గంగాధర్, గోకివాడ సర్పంచ్ కీర్తి హరనాథ్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

'జగన్ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పారు'



విజయ చిహ్నం చూపుతున్న కాపు జేఏసీ సభ్యులు

సర్పవరం జంక్షన్, జూన్ 7: కాపులకు తీవ్ర అన్యాయం చేసిన సీఎం జగన్ ప్రభుత్వానికి తగిన గుణపాఠం చెప్పారని.. పవన్,చంద్రబాబుపై ఉన్న నమ్మకంతో కాపు సామాజిక వర్గంలో అత్యధిక శాతం ఓట్లు కూటమికి వేయడంతో కూటమి సునామీ సృష్టించిందని ఆంధ్ర కాపు సద్భావన సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి ఏసుదాసు, జేఏసీ నాయకులు ఆకుల రామకృష్ణ, ఆరేటి ప్రకాశ్, నల్లా విష్ణు అన్నారు. శుక్రవారం ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులో కాపు కల్యాణ మండపంలో రాష్ట్ర కాపు జేఏసీ ఆధ్వర్యంలో టీడీపీ, జనసేన, బీజేపీ మహాకూటమి విజయోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైసీపీ అరాచక ప్రభుత్వాన్ని గద్దె దింపడంలో కాపు సామాజిక వర్గం పాత్ర మరవలేమని, ఎన్డీయే కూటమికి మంచి మెజారిటీ వచ్చేలా కృషి చేసి, అధికారంలోకి తీసుకువచ్చారన్నారు. ఈ సందర్భంగా వైసీపీ వ్యతిరేఖ ఓట్లు చీలకుండా కూటమితో జట్టుకట్టి కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చేలా కృషి చేసిన జనసేనాధిపతి పవన్ కల్యాణ్‌కు కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్రంలో జేఏసీ తరపున 45 స్థానాల్లో అభ్యర్థులకు ఎన్నికల ప్రచారం చేయగా 42 స్థానాల్లో అభ్యర్థులు విజయం సాధించారన్నారు. నిరు పేదలను గుర్తించి వారి సంక్షేమం, అభివృద్ధికి పాటుపడాలని కోరారు. కార్యక్రమంలో పలువురు కాపు జేఏసీ ప్రతినిధులు పాల్గొన్నారు.

జీజీహెచ్‌లో రెడ్‌క్రాస్ ఐ బ్యాంక్ ప్రారంభం

జీజీహెచ్ (కాకినాడ) జూన్ 7: జీజీహెచ్ ప్రాంగణంలో రెడ్‌క్రాస్ సంస్థ ఆధ్వర్యంలో నడిచే ఐ బ్యాంక్‌ను ఆసుపత్రి సూపరిండెంట్ డా.ఎస్.లావణ్యకుమారి రెడ్‌క్రాస్ చైర్మెన్ వైడి రామారావుతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. సూపరిండెంట్ మాట్లాడుతూ ఒకరి నేత్రదానంతో ఇద్దరి అంధులకు చూపును ప్రసాదించవచ్చని, దేశంలో 10 లక్షల మంది అందులు కార్నియాల కోసం ఎదురుచూస్తున్నారని వారికి నేత్రదానం చేయడం ద్వారా వారి జీవితాల్లో కొత్త వెలుగులు నింపేందుకు ప్రజలు ముందుకురావాలని పిలుపునిచ్చారు. నేత్రదానంపై అవగాహన కల్పించేందుకు ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. ఆప్తమాలజీ హెచ్‌వోడీ డా.రమాభారతి, జిల్లా అంధత్వ నివారణా సొసైటీ పథక సంచాలకులు డా.పడాల ప్రసాద్, డా.ఎస్వీరావ్, రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.శివకుమార్ పాల్గొన్నారు.

ముగిసిన వేసవి విజ్ఞాన శిబిరం

కాకినాడ సిటీ, జూన్ 7: 25రోజులుగా స్థానిక జిల్లా కేంద్ర గ్రంథాలయంలో నిర్వహించిన వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం ముగిసింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన ఆర్‌జేడీ జి.నాగమణి మాట్లాడుతూ మనిషి సంపాదన దాచుకోగలడేమోగానీ, జ్ఞానాన్ని దాచిపెట్టలేడన్నారు. మరొక అతిథి డిప్యూటీ ఎడ్యుకేషనల్ ఆఫీసర్ ఎస్.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ గ్రంథాలయాలు జ్ఞానాన్ని పంచే వేదికలన్నారు. విద్యార్థులకు ప్రశంసాపత్రాలు, మెమొంటోలు అందజేశారు. జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి బీఎల్ఎన్.వరప్రసాద్, ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్, కార్యాలయ ఉద్యోగులు ఎం.వెంకటేశ్వరరావు, ఎం.శ్రావ్య, పి.సాయి వెంకట్రావు పాల్గొన్నారు.



ప్రశంసాపత్రాలు అందజేస్తున్న ఆర్‌జేడీ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఎస్పీ

సాంకేతిక విద్యను అలవర్చుకోవాలి

ఏలేశ్వరం, జూన్ 7: సాంకేతిక విద్యను ప్రతీ ఒక్కరూ అలవర్చుకోవాలని జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ పేర్కొన్నారు. ఈనెల 16వన ఏలేశ్వరంలో నిర్వహించే శాస్త్రీయ సాంకేతిక ఇన్నోవేట్ సమిట్ పోస్టర్‌ను స్పార్క్ సభ్యులతో కలిసి కాకినాడలో ఎస్పీ శుక్రవారం ఆవిష్కరించారు. అంతరిక్ష సాంకేతిక విద్య కోసం కృషి చేస్తూ అనేక రికార్డులు సాధించడం అభినందనీయమన్నారు. సమిట్ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎస్పీ విచ్చేస్తారని సాయిసందీప్ తెలిపారు.

డేవేష్ గార్గ్ మృతికి సంతాపం

జీజీహెచ్ (కాకినాడ), జూన్ 7: మానసిక ఒత్తిడి తాళలేక మే నెలలో డెహ్రాడూన్‌లో ఆత్మహత్యకు పాల్పడిన వైద్య విద్యార్థి డా.దేవేష్ గార్గ్ మృతికి ఏపీ జూడాతో కలిసి కాకినాడ రంగరాయ వైద్యకళాశాల (ఆర్ఎంసీ) జూడాల సంఘం తీవ్ర సంతాపం తెలిపింది. ఇందులో భాగంగా శుక్రవారం రాత్రి జీజీహెచ్ ప్రాంగణంలో జూనియర్ డాక్టర్లు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. జీజీహెచ్ సైకియాట్రీ వైద్యనిపుణులు డా.వరప్రసాద్, ఆర్ఎంసీ జూడా ప్యానల్ సభ్యులు ఉన్నారు.

ఎన్టీఆర్ విగ్రహానికి పాలాభిషేకం

ప్రత్తిపాడు, జూన్ 7: ఎలక్షన్ కోడ్ ఎత్తివేస్తూ శుక్రవారం ఎన్నికల కమిషన్ ఆదేశాలు జారీ చేయడంతో చినశంకర్లపూడిలో ఎన్టీఆర్ విగ్రహానికి ముసుగు తొలగించి టీడీపీ నాయకులు మిరియాలశ్రీను, లేక సత్యనారాయణ, కర్రి దుర్గ, ఏనుగు సత్తిబాబు, మహేంద్ర సూరిబాబు, కొట్టేటి బాబురావు, సత్తిబాబు పాలాభిషేకం చేసి పూలమాల వేశారు. ప్రత్తిపాడులోని వరుపుల రాజా విగ్రహానికి పూలమాల వేశారు.

ధ్వజస్తంభానికి ప్రత్యేక పూజలు

పెద్దాపురం, జూన్ 7: మండలంలోని తిరుపతి శృంగా వల్లభస్వామి దేవస్థానంలో ధ్వజస్తంభానికి శుక్రవారం ప్రత్యేక పూజలు జరిగాయి. ధ్వజస్తంభ ప్రతిష్ట జరిగి ఏడాది పూర్తికావడంతో ఆలయ అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రసాద వితరణ చేశారు.

Anand CINEMAS
(4 SCREENS)
Experience it in 4K Dolby Atmos
BHANUGUDI JUNCTION KAKINADA
BOOK ONLINE TICKETS Paytm
NOW SHOWING

BAJE VAAYU VEGAM (TEL) (U/A)
11-30AM, 2-15PM, 6-30PM, 9-15PM
CHHOTA BHEEM AND TEH CURSE OF DAMYYAN (T) 11-20AM, 6-20PM
BAD BOYS RIDE OR DIE (TEL) (U/A)
02-30PM, 10-00PM
PREMINCHODDU : 11-15AM, 6-15PM
LOVE MOULI : 2-20PM, 9-45PM
SATYABHAMA : 11-40AM, 2-40PM, 6-4PM